# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 195 పేజిలు : 08, వెల రూ. 5రూ/ బుధవారం- 23 - జూలై- 2025


## పీడితుల పక్షాన నిలిచిన దాశరథి



## ముగిసిన టీటీడీ పాలకమండలి సమావేశం...

నేడు తిరుమల అన్నమయ్య భవన్ లో టీటీడీ బోర్డు సమావేశం

మీడియాకు వివరాలు తెలిపిన టీటీడీ చైర్మన్, ఈవో

భక్తుల రద్దీ దృష్ట్యా వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణం

ఒంటిమిట్ట రామాలయంలో అన్న ప్రసాదాల కోసం రూ.4.35 కోట్లు

142 మంది కాంట్రాక్టు డ్రైవర్ల క్రమబద్ధీకరణ



అమరావతి : ఇవాళ తిరుమలలోని అన్నమయ్య భవన్ లో టీటీడీ పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశం ముగిసిన అనంతరం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు మీడియాతో మాట్లాడారు. టీటీడీ బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. మిగతా..2లో

## తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే

అవకాశం ఉందన్న వాతావరణ శాఖ

కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్,

మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

వెల్లడించిన వాతావరణ శాఖ సంచాలకురాలు



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ మిగతా..2లో

## టీ బీజేపీ చీఫ్ రామ్ చందర్‌రావుకి భట్టి విక్రమార్క స్ట్రాంగ్ కౌంటర్



- తెలంగాణ కులగణన, రిజర్వేషన్లు దేశానికి దశ దిశ చూపుతాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు.
- బీసీ సర్వే మొదలు పెట్టినప్పుడు కొంతమంది అవసరం లేదన్నారని తెలిపారు.
- దేశవ్యాప్తంగా కులగణన సర్వే నిదర్శనంగా నిలిచిందని నొక్కిచెప్పారు.

హైదరాబాద్: బీజేపీ తెలంగాణ అధ్యక్షులు రామ్ చందర్‌రావుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

## బీసీలను మోసం చేయడమే
# కాంగ్రెస్ అసలు వైఖరి

- బీసీలను మోసం చేయడమే కాంగ్రెస్ అసలు వైఖరి అని బీఆర్ఎస్ పార్టీ ధ్వజమెత్తింది.
- కులగణన జీవో నుండి గణన ప్రక్రియ వరకు బీసీల సంఖ్యను తగ్గించి చూపడంలో కాంగ్రెస్ దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు.
- బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంలో కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిందన్నారు.



మిగతాది 2లో

హైదరాబాద్ : స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ మొదలుకొని బీసీ డిక్లరేషన్ వరకు అడుగడుగునా బీసీలను మోసం చేయడమే కాంగ్రెస్ అసలు వైఖరి అని బీఆర్ఎస్ పార్టీ ధ్వజమెత్తింది. అందుబాటులో ఉన్న బీసీ నేతలతో కేటీఆర్ సమావేశమై బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసంపై చర్చించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి మోసపూరిత వైఖరినే అనుసరిస్తుందని బీఆర్ఎస్ పార్టీ అభిప్రాయపడింది. కులగణన నుండి ప్రారంభించి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువస్తున్న ఆర్డినెన్స్ వరకు అన్ని స్థాయిల్లోనూ బీసీలను మోసం చేయడమే కాంగ్రెస్

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు



- రేవంత్ రెడ్డి ఫైట్ మోడ్ సీఎం అని ఎద్దేవా
- ఢిల్లీకి వెళ్లడంలో అర్ధ సెంచరీ సాధించారన్న కవిత
- బీసీ రిజర్వేషన్లపై జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహం

## నాసిరకం మద్యంతో ప్రాణాలు తీశారు..

### జగన్‌పై పవన్ కల్యాణ్ ఫైర్



- తమ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు.
- అమరావతి ఏకైక రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు.
- రాజధాని భూ సమీకరణపై తన నిర్ణయాన్నిఇప్పటికే సీఎం చంద్రబాబుకి చెప్పానని తెలిపారు.

# పీ 4 - జీరో పావర్టీ కార్యక్రమంపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక సర్వే

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పీ4 - జీరో పావర్టీ కార్యక్రమంపై ప్రత్యేక సర్వే చేయిస్తోంది.
- 12 ప్రశ్నలతో సర్వే నిర్వహిస్తోంది. ప్రత్యేకంగా యాప్ ద్వారా సర్వే చేస్తోంది.
- గ్రామ, వార్డ్ సచివాలయాల పరిధిలో ఈ సర్వే కొనసాగుతోంది. కుటుంబంలో ఎంత మంది ఉన్నారు..
- ఇతర ప్రాంతాల్లో ఎవరున్నారు అనే అంశంపై సర్వే చేయిస్తోంది.



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పీ4 - జీరో పావర్టీ కార్యక్రమంపై ప్రత్యేక సర్వే చేయిస్తోంది. 12 ప్రశ్నలతో సర్వే నిర్వహిస్తోంది. ప్రత్యేకంగా యాప్ ద్వారా సర్వే చేస్తోంది. గ్రామ, వార్డ్ సచివాలయాల పరిధిలో ఈ సర్వే కొనసాగుతోంది. కుటుంబంలో ఎంతమంది ఉన్నారు.. ఇతర ప్రాంతాల్లో ఎవరున్నారు అనే అంశంపై సర్వే చేయిస్తోంది. ఆస్తులు ఎన్ని.. ప్రభుత్వం ఇస్తున్న పథకాల వివరాలపై సంబంధిత అధికారులు ఆరా తీస్తున్నారు. కార్, టూ వీలర్, భూమి ఉన్నాయా అని ప్రశ్నలు అడుగుతున్నారు. టీవీ ఫ్రి జ్.. ఉన్నాయా... అని ప్రశ్నిస్తూ అధికారులు సర్వే చేస్తున్నారు. భవిష్యత్‌లో ఉద్యోగం కావాలా?.. బ్యాంక్ లోన్ కావాలా?..లేదా బిజినెస్ పెట్టుకుంటారా?. ఇలా పలు ప్రశ్నలని అడుగుతూ అధికారులు సర్వే చేస్తున్నారు. వ్యవసాయ రుణాలు, ఆదాయం వృద్ధి కోసం ఏమి కావాలనే అంశంపై ప్రశ్నలు అడుగుతున్నారు. వచ్చే నెల (ఆగస్టు) 5వ తేదీ వరకు ప్రభుత్వం సర్వే చేయనుంది. ఈ సర్వే అనంతరం ఆగస్టు 15వ తేదీన ఏపీ ప్రభుత్వం బంగారు కుటుంబాల ప్రకటన విడుదల చేయనుంది.

## మంగళగిరికి ఐటీ కంపెనీలు 50 వేల మందికి ఉద్యోగాలు



- మంగళగిరి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై లోకేశ్? సమీక్ష
- వివిధ పనుల పురోగతిని అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్

అమరావతి : మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై మంత్రి నారా లోకేశ్ అధికారులతో సమీక్ష చేపట్టారు. ఐటీ, ఇతర కంపెనీలు మంగళగిరికి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని తెలిపారు. మంగళగిరిలో 50 వేల మంది పని చేసేందుకు అవకాశం ఉందన్నారు. రెండో విడత ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు చేపట్టాలని

## భారత సైన్యం అమ్ములపొదిలో చేరిన సరికొత్త అస్త్రాలు
## హిండన్ ఎయిర్‌బేస్‌కు అపాచీ హెలికాప్టర్లు

- భారత సైన్యం అమ్ములపొదిలో చేరిన అత్యాధునిక ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్లు
- రాజస్థాన్‌లోని జోధ్‌పుర్ స్థావరంలో మోహరించనున్న ఇండియన్ ఆర్మీ



ఢిల్లీ : ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన అపాచీ హెలికాప్టర్లు భారత సైన్యం అమ్ములపొదిలో చేరాయి. అమెరికా నుంచి రావాల్సిన అత్యాధునిక 64 అపాచీ హెలికాప్టర్లు ఇవాళ వాయుసేనకు అందాయి. తొలివిడతలో భాగంగా మూడు అపాచీ హెలికాప్టర్లు ఉత్తర్‌ప్రదేశ్‌లోని హిండన్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్నాయి. యూఎస్ అంతరిక్ష సంస్థ బోయింగ్ అమెరికా నుంచి రవాణా విమానంలో వీటిని భారత్‌కు చేర్చింది. ఈ హెలికాప్టర్లను దేశ పశ్చిమ సరిహద్దులకు చేరువలోని రాజస్థాన్‌లోని జోధ్‌పుర్‌లో మోహరించనున్నారు. అపాచీ హెలికాప్టర్ల రాక ఇప్పటికే 15 నెలలు ఆలస్యం కాగా, ఈ ఏడాది చివరిలోగా మరో మూడు రానున్నాయి. గగనతలం నుంచి శత్రుమూకపై ఉరుము లేని పిడుగులా నిప్పులు కురిపించే ఈ హెలికాప్టర్ల చేరికతో భారత రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది.

### ఇదొక మైలు రాయి

అమెరికన్ మేడ్ అపాచీ హెలీకాప్టర్లు చేరికను భారత సైన్యం ఒక మైలు రాయిగా అభివర్ణించింది. ఇది భారత సైన్యం కార్యాచరణ సామర్థ్యాలను గణనీయంగా పెంచుతుందని ఎక్స్ వేదికగా మిగతా..2లో

## విజయవాడ, గన్నవరంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన మంత్రి నాదెండ్ల మనోహర్

- పౌర సరఫరాల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లక్ష్యంగా తనిఖీలు
- బియ్యం బస్తాల ప్యాకింగ్ ల పరిశీలన
- తన ఫోన్ తో స్కాన్ చేసి వివరాలు తెలుసుకున్న నాదెండ్ల



అమరావతి : ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

## ఉపరాష్ట్రపతి రాజీనామా వేళ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన డిప్యూటీ చైర్మన్ హరివంశ్..!

రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపింది.

విపక్షాల ఆందోళనలతో ప్రారంభమైన కొద్దిసేపటికే రాజ్యసభ కార్యకలాపాలు బుధవారానికి వాయిదాపడ్డాయి.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపిన రాజీనామా లేఖలో వైద్యుల సూచన మేరకు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చేందుకు రాజీనామా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. సోమవారం సాయంత్రం జగదీప్ ధన్‌ఖర్ ఉప రాష్ట్రపతిగా రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన రాష్ట్రపతిని కలువడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రపతి భవన్ 'ఎక్స్' పోస్ట్‌లో భేటీకి సంబంధించిన చిత్రాన్ని షేర్ చేసింది.

## తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో హైదరాబాద్ నగరంతో సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ సంచాలకురాలు డాక్టర్ నాగరత్న తెలిపారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు.

## ముగిసిన టీటీడీ పాలకమండలి సమావేశం...

తిరుమలలో అన్ని కార్యాలయాలు ఒకే సముదాయంలో ఉండేలా అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ నిర్మాణం తిరుమలలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణం ఈ కాంప్లెక్స్ నిర్మాణం సాధ్యాసాధ్యాలను అంచనా వేసేందుకు కమిటీ ఏర్పాటు అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల ద్వారా తిరుమల కొండపైకి వచ్చే వారి కోసం మెరుగైన వసతులు టీటీడీలో 142 మంది కాంట్రాక్టు డ్రైవర్ల క్రమబద్ధీకరణ. ఫైలు ప్రభుత్వ ఆమోదం కోసం పంపాలని నిర్ణయం ఒంటిమిట్ట రామాలయంలో అన్నప్రసాదాల కోసం రూ.4.35 కోట్లు కేటాయింపు కొత్తగా 700 వేదపారాయణదారులు ఉద్యోగాల కల్పన ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన ప్రాంతాల్లో మూడు కేటగిరీల్లో భజన మందిరాల నిర్మాణం కోసం శ్రీవాణి ట్రస్ట్ నిధుల విడుదల 320 ఆలయాలకు ఉచితంగా మైక్ సెట్ల అందజేత దేవాదాయ శాఖ సిఫారసుతో 600 మందికి నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి తిరుమలలో భక్తులు వేచి ఉండేందుకు తగిన నిర్మాణాల కోసం కన్సల్టెన్సీ నియామకం శిలాతోరణం, చక్రతీర్థం అభివృద్ధికి కన్సల్టెన్సీ నియామకం

## ఉపరాష్ట్రపతి రాజీనామా వేళ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన డిప్యూటీ చైర్మన్ హరివంశ్..!

రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపింది. జగదీప్ ధన్‌ఖర్ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే పదవికి రాజీనామా చేసి అందరికీ షాక్ ఇచ్చారు. మంగళవారం రాజ్యసభలో ఉదయం హరివంశ్ సభకు అధ్యక్షత వహించారు. అయితే, విపక్షాల ఆందోళనలతో ప్రారంభమైన కొద్దిసేపటికే రాజ్యసభ కార్యకలాపాలు బుధవారానికి వాయిదాపడ్డాయి. ఉపరాష్ట్రపతి రాజీనామా కారణంగా రాజ్యసభ చైర్మన్ పదవి సైతం ఆటోమేటిక్‌గా ఖాళీ అయ్యింది. ఉపరాష్ట్రపతి ఎగువ సభకు ఎక్స్-అఫిషియో చైర్మన్. ఈ పరిస్థితుల్లో ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం తెలుపడంతో వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభ కార్యకలాపాలు మొత్తం డిప్యూటీ చైర్మన్ హరివంశ్ చూసుకోనున్నారు. పార్లమెంట్ సమావేశాల తొలిరోజున జగదీప్ ధన్‌ఖర్ చురుగ్గానే కనిపించారు. ఉదయం సభలో సానుకూలంగా చర్చలు జరపాలని ఆయన సభ్యులకు సూచించారు. జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మాన నోటీసును అంగీకరించిన ఆయన.. ప్రక్రియను వివరించారు. జస్టిస్ శేఖర్ యాదవ్‌పై సమర్పించిన అభిశంసన నోటీసులో ఒక ఎంపీ డబుల్ సంతకంపై విచారణను చేయనున్నట్లు తెలిపారు. అయితే, ఆరోగ్య కారణాలు పేర్కొంటు ఆయన తక్షణం అమలులోకి వచ్చేలా ఆయన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపిన రాజీనామా లేఖలో వైద్యుల సూచన మేరకు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చేందుకు రాజీనామా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయన మార్చిలో ఎయిమ్స్‌లో చేరారు. ఆ తర్వాత వైద్యులు ఆయనను ఢిల్లీ వెలుపలకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. జూన్‌లో ఉత్తరాఖండ్‌లోని కుమావున్ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన వేదికపైనే స్పృహ కోల్పోయారు. ఆ రోజు వేడి పరిస్థితులు ఉన్నట్లుగా అధికారులు తెలిపారు. ఈ నెల ప్రారంభంలో ఆయన కేరళలో పర్యటించారు. ఈ సమయంలో ఆరోగ్యం క్షీణించగా.. భార్య ఆయనకు అండగా ఉన్నారు. జులై 17న ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన భార్య మంచినీళ్లు తీసుకువచ్చి ఇవ్వగా పరిస్థితి మెరుగైంది. ఈ క్రమంలోనే ఆయన ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వైద్యుల సూచనల మేరకు కీలక బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు తెలుస్తున్నది.

## టీ బీజేపీ చీఫ్ రామ్ చందర్‌రావుకి భట్టి విక్రమార్క స్ట్రాంగ్ కౌంటర్

ఆయన స్పందించారు. లీగల్ నోటీస్‌లకు తాను భయపడేవాడిని కాదని.. ఆయన ఇచ్చిన నోటీస్‌లకు సమాధానం చెబుతానని తెలిపారు. ఇవాళ(మంగళవారం) తెలంగాణ సచివాలయంలో మల్లు భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. రామచందర్‌రావుకు దళిత బహుజనులంటే చిన్నచూపు ఉందని ధ్వజమెత్తారు. వారికి మేలుచేసే పనులకు అడ్డు తగలడం బీజేపీ అధ్యక్షుడికి బాగా అలవాటని మండిపడ్డారు మల్లు భట్టి విక్రమార్క. హెచ్‌సీయూ ఘటనలో ఆయన పాత్ర కూడా ఉందని అందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. బీసీ రిజర్వేషన్లు మీరే చెప్పారు మీరే చేయాలని అనడం ఏంటని ప్రశ్నించారు. బీజేపీలో తీర్మానం చేయాలని తాము అడగటం లేదని.. కేంద్రప్రభుత్వం చేయాలని మాత్రమే తాము కోరుతున్నామని.. ఆయనకు ఈ విషయం సరిగా అర్థం కానట్లు ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణ కులగణన, రిజర్వేషన్లు దేశానికి దశ దిశ చూపుతాయని ఉద్ఘాటించారు. బీసీ సర్వే మొదలు పెట్టినప్పుడు కొంతమంది అవసరం లేదన్నారని.. ఇప్పుడు దేశవ్యాప్తంగా కులగణన సర్వే నిదర్శనంగా నిలిచిందని నొక్కిచెప్పారు మల్లు భట్టి విక్రమార్క. గతంలో కుల గణన అవసరం లేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్లమెంట్‌లో చెప్పారని గుర్తుచేశారు. తెలంగాణలో సర్వే జరిగాక దేశవ్యాప్తంగా జరపాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణ సర్వేను సమర్థించారని ఉద్ఘాటించారు. తెలంగాణ బిల్లుపై గత కొన్ని రోజులుగా కేంద్ర హెూం శాఖలో చర్చలో ఉందని తెలిపారు. బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా తాము మద్దతు కూడపెడుతున్నామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ఎంపీలు, ఇండియా కూటమి సభ్యులను కలిసి మద్దతు అడగబోతున్నామని పేర్కొన్నారు మల్లు భట్టి విక్రమార్క. లోక్‌సభ, రాజ్యసభలో అందరినీ కలిసి మద్దతు అడుగుతామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీకి బృందంగా వెళ్తున్నామని వెల్లడించారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం కోసం ఎంపీలను కలిసి మద్దతు కోరుతామని చెప్పుకొచ్చారు. ఇండియా కూటమి, అధికార బీజేపీ ఎంపీలను సైతం కలిసి మద్దతు కోరుతామని అన్నారు. తమకు నమ్మకం ఉందని.. బీసీ బిల్లు ఆమోదం పొందుతుందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## భారత సైన్యం అమ్ములపొదిలో చేరిన సరికొత్త అస్త్రాలు - హిండన్ ఎయిర్‌బేస్‌కు అపాచీ హెలికాప్టర్లు

ఓ పోస్ట్ పెట్టింది. "ఇండియన్ ఆర్మీ ఏవియేషన్ కోసం మొదటి బ్యాచ్ అపాచీ హెలీకాప్టర్లు ఈ రోజు భారతదేశానికి చేరుకున్నాయి. ఇది ఒక మైల్ స్టోన్ మూమెంట్. ఇది మన భారత సైన్యం కార్యాచరణ సామర్థ్యాలను గణనీయంగా పెంచుతుంది." - ఇండియన్ ఆర్మీ ఎక్స్ పోస్ట్

### ఎగిరే యుద్ధ ట్యాంకులు

ఎగిరే యుద్ధట్యాంకుగా పేరుపొందిన ఈ అపాచీ హెలికాప్టర్లు నింగిలో అద్భుత విన్యాసాలు చేస్తూ ప్రత్యర్థులను తికమక పెట్టగలవు. వీటిలో అధునాతన కమ్యూనికేషన్లు, నేవిగేషన్, సెన్సర్, ఆయుధ వ్యవస్థలు ఉన్నాయి. శత్రువుపై గురితప్పకుండా ఆయుధ ప్రయోగం చేసేందుకు మోడర్నైజ్ టార్గెట్ అక్విజీషన్ డిజి గ్నేషన్ సిస్టమ్ దీనిలో ఉంది. రాత్రి పగలు అని తేడా లేకుండా శత్రుస్థావరాలపై దాడులు చేయడానికి ఇది సాయపడుతుంది. ధూళి, వర్షం, పొగమంచు వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ కచ్చితత్వంతో దాడులు చేసే సామర్థ్యం వీటి సొంతం. ఈ హెలికాప్టర్ ప్రధాన బలం దీని రెక్కలపై ఉండే లాంగ్ బౌ రాడార్ వ్యవస్థ. అందువల్ల చెట్లు, కొండల మాటున దాగి ఉంటూ దాడులు చేయగలదు. శక్తిమంతమైన ఇంజిన్లు, పటిష్టమైన రెక్కలు కారణంగా ప్రత్యర్థుల దాడులను కాచుకోగలదు. గంటకు గరిష్ఠంగా 279 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే ఈ హెలికాప్టర్లు దాదాపు 6 వేల మీటర్ల ఎత్తుకు ఎగరగలదు. అంతేకాదు, తక్కువ ఎత్తులో ఎగురుతూ మెరుపు దాడులు చేసి సురక్షితంగా తిరిగిరాగలదు. శక్తిమంతమైన 30 %వీవీ% చైన్‌గన్ వ్యవస్థ కలిగి ఉన్న ఇవి నిమిషానికి 16 వందల వరకూ తూటాలను పేల్చగలవు. నేలపైనున్న భిన్నలక్ష్యాల పైకి రాకెట్లతో ఏకకాలంలో దాడులు చేయగలదు. అంతేకాదు ఈ అపాచీ హెలికాప్టర్ ఆకాశం నుంచి భూమిపైకి హెల్ ఫైర్ క్షిపణులను, 70ఎంఎం హైడ్రా రాకెట్లును ప్రయోగించగలదు. అలాగే గగనతల దాడులకు స్టింగర్ క్షిపణులు వంటి వివిధ రకాల బాంబులను వేయగలదు. భారత వైమానిక దళం వద్ద ఇప్పటికే 22 అపాచీ హెలికాప్టర్లు ఉన్నాయి. అదనంగా సైన్యం కోసం 600 మిలియన్ డాలర్ల వ్యయంతో ఆరు హెలికాప్టర్లను అమెరికా నుంచి కొనుగోలు చేసేందుకు కేంద్రప్రభుత్వం 2020 ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. తొలి విడతలో 3 హెలికాప్టర్లు భారత సైన్యానికి అందాయి.

## బీసీలను మోసం చేయడమే కాంగ్రెస్ అసలు వైఖరి

అసలైన లక్ష్యంగా ఉందని విమర్శించింది. బోనాల పండుగ సందర్భంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంట్లో అందుబాటులో ఉన్న బీసీ ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ద్రోహ పూరిత కార్యక్రమాలపైన కేటీఆర్ విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీ కేవలం బీసీలను మోసం చేయాలన్న దురుద్దేశంతోనే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన అంశంలో, ప్రతి సందర్భంలో చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిందని బీసీ నేతలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారు. తాము తీసుకువచ్చిన చట్టం ఆమోదం పొందదని తెలిసినా, మరోసారి ఆర్డినెన్స్ పేరుతో కొత్త నాటకానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతోందని వారు పేర్కొన్నారు. కులగణన జీవో నుండి గణన ప్రక్రియ వరకు బీసీల సంఖ్యను తగ్గించి చూపడంలో కాంగ్రెస్ దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా బీసీలకు తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంలో కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిందన్నారు. తాము చేపట్టిన ప్రతీ ప్రక్రియలో ఉన్న లోపాలు, లొసుగులు ముందే తెలిసినా, బీసీలను మోసం చేయాలన్న దురాలోచనతో ఇప్పుడు కోర్టుల పేరుతో, చట్టపరమైన నిబంధనలు చూపిస్తూ తప్పించుకోవడానికి కాంగ్రెస్ రంగం సిద్ధం చేస్తున్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కులగణన మరింత శాస్త్రీయంగా జరగాలని చెప్పే కాంగ్రెస్ పార్టీ.. అత్యంత లోపభూయిష్టంగా దురుద్దేశపూర్వకంగా నిర్వహించిన కులగణన సర్వేను జాతీయ రోల్ మోడల్‌గా చెప్పడం ద్వారా తెలంగాణ ప్రజలను మోసం చేయడమే కాకుండా, జాతీయ వేదికలపై అబద్ధాలు చెబుతున్నదని నేతలు మండిపడ్డారు. ఒకవైపు 42 శాతం రిజర్వేషన్ల అంశంలో బీసీలను మోసం చేస్తూనే.. బీసీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ సర్కారు అమలు చేయకుండా బీసీలను మభ్యపెడుతుందని బీసీ నేతలు అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల కోసం ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ వారికి చేస్తున్న ద్రోహమే అన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు

మొదటి పేజి తరువాయి



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఫ్లైట్ మోడ్ సీఎం అని ఎద్దేవా చేశారు. ఆయన ఈ రోజు కూడా ఢిల్లీకి వెళుతున్నారని, దేశ రాజధానికి వెళ్లడంలో ఆయన ఇప్పటికే అర్ధ సెంచరీ సాధించారని వ్యంగ్యం ప్రదర్శించారు. ఇన్నిసార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లపై మాత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒప్పించే ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి గట్టిగా మాట్లాడాలని సూచించారు. హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ, పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పారని, అయితే బీసీలు పార్టీల పరంగా రిజర్వేషన్లు కోరుకోవడం లేదని తెలిపారు. చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను వారు కోరుకుంటున్నారని తెలిపారు. రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే బీసీ బిడ్డలు వారిని వదిలి పెట్టరని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై రెండు జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని కవిత ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడుతున్న మాటలు బాధాకరమని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో పాస్ చేసి గతంలోనే పంపించినప్పటికీ రాష్ట్రపతి వద్ద పెండింగులో పెట్టి తిరిగి పంపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లుకు మతపరమైన రంగు పులిమి బీజేపీ బిల్లును పాస్ చేయడం లేదని విమర్శించారు. గుజరాత్‌లో ఎలాంటి రిజర్వేషన్లు ఇచ్చారో అందరికీ తెలుసని, తెలంగాణ విషయంలో మాత్రం బీజేపీ మరో రకంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ 50 శాతానికి పైగా రిజర్వేషన్లను అమలు చేస్తోందని కవిత వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి న్యాయస్థానాల పరిధిలో ఉందని సాకులు చెబుతోందని విమర్శించారు. బీసీ బిడ్డలను రిజర్వేషన్లకు దూరంగా ఉంచాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

## నాసిరకం మద్యంతో ప్రాణాలు తీశారు..

మొదటి పేజి తరువాయి



అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం నిషేధిస్తామని చెప్పిన జగన్.. అధికారంలోకి వచ్చి ఏం చేశారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం మద్యం ఏరులై పారించిందని ఆరోపించారు. మద్య నిషేధం నినాదంతో అధికారంలోకి వైసీపీ వచ్చిందని.. కానీ ఆ హామీని జగన్ మర్చిపోయారని మండిపడ్డారు. అనేక మందికి నాసిరకం మద్యంతో లివర్ దెబ్బ తిని ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు. ఇవాళ(మంగళవారం) ఏపీ సచివాలయంలో పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ కార్యాలయానికి అనేక మంది బాధితులు వచ్చారని.. ఇప్పుడు మద్యం కుంభకోణంలో అనేక మంది అరెస్టు అవుతున్నారని తెలిపారు. ఒకవైపు నిధులు తినేశారు.. మరోవైపు జనం ప్రాణాలు తీశారని ధ్వజమెత్తారు పవన్ కల్యాణ్. అయినా ఇంకా బెదిరింపుల ధోరణితో జగన్, వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని పవన్ కల్యాణ్ ఫైర్ అయ్యారు. ఇటువంటి కాగితపు బెదిరింపులకి ఎవరూ భయపడరని.. ఇలాంటి తాటాకు చప్పుళ్లు చాలా చూశామని హెచ్చరించారు. ఎన్నో పోరాటాలు చేసి ఇక్కడ నిలబడ్డామని... ఇంతటి ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చామని ఉద్ఘాటించారు. అవినీతి, అడ్డగోలుగా వ్యవహరించి కూడా ఇంకా ఎందుకు అరుస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వారి అరుపులను పట్టించుకోదని చెప్పుకొచ్చారు. వాళ్లు రప్పా రప్పా అంటే తాము మెడలు కోయించుకోవడానికి సిద్ధంగా లేమని హెచ్చరించారు. వాళ్లు కోస్తామంటే తాము మరోవైపు నుంచి మెడ చూపిస్తామా..? అని ప్రశ్నించారు. ఇక్కడ ఎవరూ అంత తేలికగా లేరని వార్నింగ్ ఇచ్చారు పవన్ కల్యాణ్. రాజధాని అమరావతి భూ సమీకరణపై తన నిర్ణయాన్నిఇప్పటికే సీఎం చంద్రబాబుకి చెప్పానని.. సీఎం కూడా తన అభిప్రాయంతో ఏకీభవించారని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అందరిని ఒప్పించి వాళ్లను కూడా భాగస్వాములుగా చేసి ముందుకు వెలుదామని చెప్పానని.. అందుకు సీఎం కూడా ఒప్పుకున్నారని తెలిపారు. మనం అమరావతి ఏకైక రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు. అందుకనే వివాదాలు చేయకూడదని చెప్పానని అన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమని ఉద్ఘాటించారు. మంచి సినిమా కథలు వస్తే నిర్మాతగా వ్యవహారిస్తానని.. ఈ అంశాలన్నీ కూడా సీఎం చంద్రబాబుకు కూడా చెప్పానని గుర్తుచేశారు. సీఎంకు చెప్పిన అనంతరమే సినిమాల గురించి నిర్ణయాలు తీసుకున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## మంగళగిరికి ఐటీ కంపెనీలు - 50 వేల మందికి ఉద్యోగాలు

మొదటి పేజి తరువాయి



ఐటీ, ఇతర కంపెనీలు మంగళగిరికి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని, భవిష్యత్?లో 50 వేల మంది పని చేసేందుకు అవకాశం ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్? తెలిపారు. వివిధ పనుల పురోగతిని అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మంగళగిరికి ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని, ఇందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలన్నారు.

**'మరో 2 వేల మందికి ఇళ్ల పట్టాలు - పేదలకు టిడ్కోఇళ్లు ఇచ్చేందుకు ప్రణాళికలు'**

రెండో విడతలో 2వేల ఇళ్ల పట్టాల పంపిణీలు : మంగళగిరిలో వివిధ ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారికి రెండో విడతలో 2వేల ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు చేపట్టాలని గతంలోనే మంత్రి ఆదేశించిన సంగతి తెలిసిందే. ప్రజలు నివసించేందుకు అనుకూలంగా వివిధ ప్రాంతాల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల టిడ్కో ఇళ్లను నిర్మించాల్సిన అవసరం ఉందని, ఇందుకు అవసరమైన స్థల సేకరణపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. మరోవైపు నియోజకవర్గంలోని అభివృద్ధిలో భాగంగా ఇళ్లు లేని పేదలకు నూతనంగా టిడ్కో గృహ సముదాయాల నిర్మాణానికి స్థలాన్ని సేకరించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గతంలోనే అధికారులను ఆదేశించారు. దీర్ఘకాలంగా వివిధ ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న మరో 2 వేల మందికి వచ్చే నెలలో శాశ్వత ఇళ్ల పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించిన విషయం విదితమే. మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సమీకృత అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, వాటర్, గ్యాస్, పవర్ ప్రాజెక్టులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో నిర్మించనున్న 31 సామాజిక భవనాలు, 26 పార్కులు, శ్మశాన వాటిక నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోధనతో పాటు వారికి పాఠశాలల్లో సురక్షితమైన వాతావరణం : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యారంగాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచాలని నిర్ణయించామని లోకేశ్? తెలిపిన సంగతి తెలిసిందే. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు మీద విద్యా కిట్లు, డొక్కా సీతమ్మ పేరిట సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నామని చెప్పారు. వన్ క్లాస్ వన్ టీచర్ విధానంతో 9,600 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేశామని, తల్లికి వందనం పథకం కింద 67.27 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10 వేల కోట్లు జమ చేశామని వివరించారు.తరగతి గది నుంచే మహిళలను గౌరవించే పాఠ్యాంశాల బోధనతో పాటు వారికి పాఠశాలల్లో సురక్షితమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## విజయవాడ, గన్నవరంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన మంత్రి నాదెండ్ల మనోహర్



ఈరోజు విజయవాడలోని గొల్లపూడి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ప్రాంగణంలోని సివిల్ సప్లై గోడౌన్‌ను, అలాగే గన్నవరం సివిల్ సప్లై గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పౌర సరఫరాల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడమే లక్ష్యంగా ఈ తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 41,091 పాఠశాలలు మరియు 3,800 సంక్షేమ హాస్టళ్లకు మధ్యాహ్న భోజన పథకం కింద 25 కిలోల బస్తాల్లో బియ్యం పంపిణీ జరుగుతోందని తెలిపారు. ఈ పథకాన్ని మరింత మెరుగుపరచడానికి ప్రతి బియ్యం బస్తాపై క్యూఆర్ కోడ్ ముద్రించడం జరుగుతోందని, దీనికి చిన్నారులు, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తోందని ఆయన అన్నారు. విజయవాడ ఎం.ఎల్.ఎస్. పాయింట్ నుంచి ఇబ్రహీంపట్నం, విజయవాడ అర్బన్, విజయవాడ రూరల్ పరిధిలోని 378 చౌక ధరల దుకాణాలకు బియ్యం సరఫరా అవుతోంది. గన్నవరం రైస్ గోడౌన్ నుంచి గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లోని 103 చౌక ధరల దుకాణాలకు సరఫరా జరుగుతోంది. ఈ నేపథ్యంలో, మంత్రి గోడౌన్‌లోని మధ్యాహ్న భోజనానికి అందించే బియ్యం బస్తాల ప్యాకింగ్‌లను నిశితంగా పరిశీలించారు. బియ్యం బస్తాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను తన ఫోన్ ద్వారా స్వయంగా స్కాన్ చేసి, వివరాలు సరిగ్గా వస్తున్నాయో లేదో తనిఖీ చేశారు. బఫర్ గోడౌన్ నుంచి వచ్చిన స్టాక్‌ను దిగుమతి చేసుకున్న తర్వాత, మండల్ లెవెల్ స్టాక్ పాయింట్ నుంచి డీలర్లకు ఎగుమతి చేసేటప్పుడు ప్యాకింగ్‌లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని హమాలీ కూలీలను అడిగి తెలుసుకున్నారు. బియ్యం బస్తా ప్యాకింగ్, బియ్యం నాణ్యత, గోడౌన్ పరిసరాల పరిశుభ్రత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని, ఇందులో ఏమైనా పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తప్పవని అధికారులను మంత్రి హెచ్చరించారు. తూకం, ఆయిల్ ప్యాకెట్లను కూడా ఆయన స్వయంగా తనిఖీ చేశారు. గత మూడు నెలల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించగా, కొంత మంది డీలర్ల వద్ద క్లోజింగ్, ఓపెనింగ్ స్టాక్‌లో గణనీయమైన వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో, విజయవాడ రైస్ గోడౌన్ నుంచి బియ్యం తీసుకుంటున్న నాలుగు డీలర్ల స్టాక్ వెరిఫికేషన్‌లో వ్యత్యాసం ఉన్నట్లు కనుగొన్నారు. ఈ అక్రమాల నేపథ్యంలో, మంత్రి ఏలూరు రోడ్డులోని పోతినేని వారి వీధిలో ఉన్న ఒక చౌక ధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ దుకాణం వద్ద డీలర్ లేకపోవడం, ఉండవలసిన స్టాక్ లేకపోవడం, దుకాణం బయట విధిగా ఏర్పాటు చేయవలసిన పోస్టర్ లేకపోవడంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి చౌక ధరల దుకాణం వద్ద విధిగా స్టాక్, అధికారుల వివరాలు, అభిప్రాయం మరియు ఫిర్యాదులు చేయడానికి క్యూఆర్ కోడ్ స్కానర్‌తో కూడిన పోస్టర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా ఒకటో తారీఖు నుంచి 15వ తారీఖు వరకు ప్రజలకు రేషన్ బియ్యాన్ని అందిస్తున్నామని మంత్రి తెలిపారు. సంస్కరణలలో భాగంగా దివ్యాంగులకు, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రతి నెలా 5 రోజులు ముందుగా (25వ తేదీ నుంచి 30వ తేదీ లోపు) వారి ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలను దృష్టిలో ఉంచుకుని, కూటమి ప్రభుత్వం కఠినమైన తనిఖీలతో నిబంధనలను పటిష్టంగా అమలు చేస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. పౌర సరఫరాల వ్యవస్థలో పూర్తి పారదర్శకత మరియు జవాబుదారీతనం తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## విద్యా వికాసానికి విద్యా మంత్రి బాటలు!

విద్య ఒక్కటే సామాజిక అసమానతలను రూపుమాపే సాధనం. అటువంటి విద్యా రంగాన్ని ఒక పథకం ప్రకారం గత ప్రభుత్వం ధ్వంసం చేసి దాని పీకనులి మిన పరిస్థితుల్లో మళ్లీ విద్యా రంగంలో పునరుత్తేజం తేవాలని, ఆధునిక జీవన ప్రమాణాలకు తగినట్లుగా ప్రభుత్వ విద్యను పరిపుష్టం చేయాలనే తలంపుతో ఏపీ విద్యా మంత్రి నారా లోకేష్ విద్యారంగాన్ని ముందుండి నడిపిస్తున్నారు.

రాజకీయ పార్టీలకు ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష వంటివే..

తల్లిదండ్రుల ఆశలు, ఉపాధ్యాయుల బాధ్యత, ప్రభుత్వ సంకల్పంతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు నారా లోకేష్ శ్రీకారం చుట్టారు. రాష్ట్ర విద్యా వ్యవస్థను సమూలంగా మార్పులకు పలు కీలక సంస్కరణలు తీసుకొస్తున్నారు. పాత విధానాలకు స్వస్తి పలికి ఆధునిక విద్యా మోడల్‌ను తీసుకువస్తున్నారు. అందులో భాగంగా కొన్ని ప్రధాన చర్యలు చేపట్టారు. పాఠశాలల పనితీరు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యాస పురోగతి, తల్లిదండ్రులతో సమావేశాలు, ప్రతి స్కూల్ వివరాలను డిజిటల్ డాష్‌బోర్డ్‌లో నమోదు చేసి, సమీక్షలు చేయనున్నారు. విద్యను అందరికీ చేరువ చేసి ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్టను తిరిగి తీసుకురావడానికి ఆయన కృషి చేస్తున్నారు.. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని తెచ్చిన సంస్కరణలు రాష్ట్ర విద్యా రంగానికి ఒక విశిష్ట మలుపు తిప్పనున్నాయి. ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్యవరకు సమగ్ర అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్నారు.

హాయిగా బతికేందుకు అవకాశం ఉన్నా బతకలేక..

పేరెంట్స్-టీచర్స్ భేటీ ముందడుగు

విద్యార్థుల విద్యా పురోగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమని భావించి, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్- టీచర్ మీటింగ్స్ తప్పనిసరి చేశారు. ముఖ్యంగా ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత పాఠశాలల వరకు పీటీఎంలను విధిగా నిర్వహించాలని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. తల్లిదండ్రుల మద్దతు లేకుండా విద్యార్థుల అభివృద్ధి సాధ్యం కాదని తల్లిదండ్రుల కలలలో, ఉపాధ్యాయుల ఆశయాలలో విద్యార్థుల కళ్లలో వెలిగే శాశ్వత వెలుగు, ఈ కలల వెలుగును కార్య రూపంలోకి తీసుకురావాలన్న దృఢ సంకల్పంతో విద్యాశాఖ మంత్రి తల్లిదండ్రులతో నిర్వ హించిన సమాలోచన ప్రపంచంలోనే అతి పెద్ద తల్లిదండ్రుల సమావేశం.

అక్షర సేనాని దాశరథి

ప్రజల భాగస్వామ్యంలో రికార్డు..

2025 జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 2.0 కార్య క్రమంలో దాదాపు 2.3 కోట్ల మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్ గిన్నిస్ రికార్డు సృష్టించింది. కానీ ఇది కేవలం గణాంకాల ఘనత కాదు. ఇది ఒక కొత్తతరం విద్యా దిశకు రాష్ట్ర ప్రజల భాగస్వామ్య సంకేతం. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రుల అవగాహన. ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని, ప్రగతిని తల్లి దండ్రులు ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ఇది వేదిక. తల్లి దండ్రులు పాఠశాలలపై నమ్మకాన్ని కలిగి ఉండేలా చేయడం, తల్లిదండ్రులను పాలనలో భాగస్వాములుగా మార్చడం, పాఠశాలల్లో మెరుగుదల కోసం తల్లిదండ్రుల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించడం, విద్యా విధానాలు ప్రజల అభిరుచులకు దగ్గరగా ఉండేలా చేయడం, విద్యా మంత్రి సమక్షంలో పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0ని నిర్వర్తించారు. ఈ భేటీలలో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులతో మాట్లాడటం జరిగింది.

ప్రైవేట్ ప్రయాణ సర్వీసుల ధరలు నియంత్రించాలి!

బోధనను తల్లిదండ్రులు తెలుసుకోవాలి!

చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల కోసం డబ్బులు

# సంపాదకీయం

## సృష్టి.. స్థితి.. లయంలో గాజా

యుద్ధ బీభత్సాన్ని వ్యక్తం చేయలేని భాష ప్రపంచంలోనే ఉండదు. యుద్ధం ఏ స్థాయిదైనా కావచ్చు. అది ఆదిమ తెగల మధ్యదీ కావచ్చు, సమ ఉజ్జీల మధ్యదీ కావచ్చు. భాషలో ఒకపట్టాన వర్ణించలేని యుద్ధాలు చాలా అరుదు. మానవ సమూహాలన్నీ ఏదో ఒక దశలో యుద్ధంతో సహజీవనం చేశాయి. అందుకే వీర కావ్యాలూ గాథలూ లేని మానవ సమూహమే లేదు. కానీ నిరంతర బీభత్సమై, కిరాతకమై, నరమేధమై, సర్వస్వ హననమైన యుద్ధాలు మనుషుల విషాద వ్యక్తీకరణ సామర్థ్యానికే సవాలుగా నిలుస్తాయి. ఆ యుద్ధాలకు దూరంగా నివసించే మనుషులకు అదింకా కష్టంగా మారుతుంది. 2023 అక్టోబరు 7 నుంచి గాజాలో జరుగుతున్న జీవన విధ్వంసంపై ఇంకా గొంతుకలు పూర్తిగా పెగల్లేని పరిస్థితే ఉంది. మాటలకు తడుముకోవటమే ఉంది. వాక్యాల కోసం వ్యాకులత చెందటమే ఉంది. భావాల కోసం భాషలను గాలించటమే ఉంది. దృశ్యాలను ప్రదర్శించలేని అశక్తతే ఉంది. మన అనుభవం పూర్తిగా ఆకళింపు చేసుకోలేని, ఊహించుకోలేని విచ్ఛిన్న, విషాదకర, వివర్ణ పరిస్థితి గాజాలో నెలకొంది. నమ్మశక్యం కాకపోయినా ఇది నిజం! కిందామీదా పడుతూ నిటారు కఠిన కొండ శిలలను ఎక్కి చుట్టూ పరచుకున్న ప్రపంచాన్ని ఎంతమేరకు చూడగలమో అందులో వెయ్యోవంతు స్థాయిలోనే ఇప్పుడు గాజా బీభత్సాన్ని చూడగలం. అది అసంపూర్ణం. అసమగ్రం. అయినా ఆ పరిమిత దృశ్యమే అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. జరుగుతోన్న దారుణాలకూ కిరాతకాలకూ చరిత్ర మూలాల్లోకి వెళ్లేలా చేస్తోంది. సరిహద్దు గోడలనూ, ఇనుపముళ్ల కంచెలనూ పగలగొట్టి హమాస్ తీవ్రవాద ప్రేరేపితులు (2023 అక్టోబరు 7) ఇజ్రాయెల్ భూభాగంలోకి చొరబడి 1200 మందికి పైగా చంపేశారు. ఎంతో మందిని బందీలుగా పట్టుకెళ్లారు. ఆ దారుణాన్ని అందరూ ఖండించారు. ప్రజాస్వామ్య స్ఫూర్తినీ, సాంస్కృతిక భిన్నత్వాన్నీ మనసావాచాకర్మణా కోరుకునే వారిని నిలువెల్లా కలచివేసిన సంఘటన అది. అయినా హమాస్ లాంటి సంస్థలను ఎదుర్కొనటానికి యుద్ధాన్నే పరిష్కారంగా వారు భావించటం లేదు. ఏదో ఒక మిషతో గాజాపై యుద్ధాలు ప్రకటించటం, దాడులు చేయటం ఇజ్రాయెల్‌కు కొత్తకాదు. 2014 నాటికే గాజాపై 12 సార్లు ఇజ్రాయెల్ యుద్ధానికి పాల్పడిన విషయాన్ని ప్రముఖ ఫ్రెంచ్ చరిత్రకారుడు జీన్ పియర్ ఫిలియు పదేళ్ల కిందటే చెప్పారు. ఆ యుద్ధాల్లో ఇజ్రాయెల్ వేలాది మందిని చంపేసింది. అనేక భౌతిక సౌకర్యాలను విధ్వంసం చేసింది. మధ్య ఆసియాలోనే కాదు, ప్రపంచంలోని ఏ దేశమూ ఇజ్రాయెలంత శత్రుదుర్భేద్యంగా ఉండదు. ఏదో చేస్తారన్న అనుమానంతో, అంచనాతో, ముందుగానే పడగొట్టాలనే ఆలోచనతో చుట్టుపక్కల దేశాలపై దాడులు చేయటంలో ఇజ్రాయెల్‌కు సాటి వచ్చే దేశమేదీ లేదు. అత్యాధునిక ఆయుధాలతో, డ్రోన్లతో, సైబర్ సెక్యూరిటీతో, క్షిపణి రక్షణ వ్యవస్థలతో, పటిష్ఠ గూఢచర్యంతో, అణ్వస్త్రాలతో ఇజ్రాయెల్ నెలకొల్పుకున్న ఆధిపత్యాన్ని సవాల్ చేయగలిగిన పరిస్థితి ఇరుగుపొరుగున కనపడదు. అయినా హమాస్ దాడితో తన అస్తిత్వానికే ముప్పు ఏర్పడిందనే కారణంతో గాజాపై 20 నెలలుగా కనీవినీ ఎరగని రీతిలో దాడులు చేస్తోంది. ఒక చిన్న ప్రదేశంపై చరిత్ర చూడని దాడులకు పాల్పడుతూ ఇప్పటికే 60 వేలకు పైగా మరణాలకు కారణమైంది. ఆహార పదార్థాలను అందనీయటం లేదు. మందులను చేరనీయటం లేదు. వితరణ హస్తాలనూ విరిచేస్తోంది. వేలభవనాలను శిథిలాలుగా మార్చుతోంది. మంచినీరునూ పారనీయటం లేదు. కరెంటుకు అంతరాయాలు సృష్టిస్తోంది. పాఠశాల భవనాలను కుప్పకూల్చుతోంది. ఆసుపత్రులపైనా బాంబుల వర్షం కురిపిస్తోంది. సొరంగాలు పేలుస్తోంది. ప్రాణం నిలుపుకోటానికి అవసరమైన ప్రతిదాన్నీ పనికి రాకుండా చేస్తోంది. గాజా (గాజా స్ట్రిప్) అనేది 140 చదరపు మైళ్ల ప్రాంతం. దాని సృష్టే కృతకమైంది. 1948 నాటి యుద్ధ సమయాన అసంబద్ధ సరిహద్దులతో దాన్ని ఏర్పరచారు. ప్రాచీన నాగరికత చరిత్రలో ఘనమైన పాత్రను పోషించిన ఒక నగరాన్నీ దాని చుట్టుపక్కల ప్రాంతాన్నీ.. విశాల పూర్వ పాలస్తీనాతో సంబంధాలను తెంచి సామాజిక జీవనాడులను ఛిన్నాభిన్నం చేసిన దృశ్యమే 77 ఏళ్లుగా అక్కడ ఉంది. 28 మైళ్ల పొడవు, ఉత్తరాన 4.3 మైళ్ల వెడల్పు, దక్షిణాన 7.8 మైళ్ల వెడల్పు, మళ్లీ మధ్యలో 3.4 మైళ్లకు కుదింపు.. పశ్చిమాన మధ్యధరా సముద్రం.. ఇలా భౌగోళికంగా అసహజ సరిహద్దులను నిర్దేశించిన గాజాకు.. 1948 నుంచి విషాదాలు, వైపరీత్యాలు వెన్నాడుతూనే ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన పరిమితులను అతిక్రమించి పాలస్తీనాకు కేటాయించిన (44శాతం) భూభాగంలో అధికభాగాన్ని 1948లో బలవంతంగా స్వాధీనం చేసుకోవటంతోనే ఇజ్రాయెల్ ఆక్రమణల చరిత్ర మొదలైంది. మరోవైపు గాజా ప్రాంతాన్ని ఈజిప్టు, వెస్ట్‌బ్యాంకు ప్రాంతాన్ని జోర్డాన్ ఆక్రమించటంతో పాలస్తీనా ప్రజలకు తమదంటూ స్వేచ్ఛగా మసలే భూభాగమే లేకుండా పోయింది. ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకున్న ప్రాంతాల్లో పాలస్తీనా ప్రజల్లో భయోత్పాతాన్ని కలిగించటానికి వందలాది గ్రామాలను నేలమట్టం చేశారు.

# ఎన్నాళ్లీ జనహననం?




అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి సిఫార్సు చేసి ప్రపంచాన్ని నివ్వెరపరిచిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ గాజాలో కొనసాగిస్తున్న మారణకాండను ఆపదల్చుకోలేదని తాజా అమానుష ఉదంతం రుజువు చేస్తోంది. నిరాయుధ పౌరులనూ, మరీ ముఖ్యంగా స్త్రీలనూ, పిల్లలనూ హతమార్చటం ఇజ్రాయెల్ సైన్యానికి గత ఇరవైయ్యొక్క నెలలుగా రివాజుగా మారినా... ఆదివారం జరిగిన ఘోరం అత్యంత హేయమైనది. ఐక్యరాజ్యసమితి సంస్థ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం (డబ్ల్యూఎఫ్‌పీ) ఆధ్వర్యాన ఆహార పంపిణీ మొదలుపెట్టబోతుండగా పౌరు లను చుట్టుముట్టి శతఘ్నులతో, స్నైపర్లతో విరుచుకుపడి 90 మందికిపైగా పౌరుల్ని ఇజ్రాయెల్ సైన్యాలు పొట్టనబెట్టుకున్నాయి. 2023 అక్టోబర్ 7న తమ భూభాగంలోకి అడుగుపెట్టి 1,200 మంది పౌరులను కాల్చిచంపి, మరో 251 మందిని అపహరించిన మిలిటెంట్ సంస్థ హమాస్‌ను తుదముట్టించటానికి దాడులంటూ మొదట్లో చెప్పిన ఇజ్రాయెల్ ఆనాటినుంచి మారణకాండ కొనసాగిస్తూనే ఉంది. అధికారిక లెక్క ప్రకారం ఇప్పటికి 60,000 మంది పౌరులు మరణించారంటున్నా... అంతర్జాతీయ మేగజిన్ లాన్సెట్ నిరుడు జూన్‌లో ప్రకటించిన నివేదిక అది దాదాపు రెండు లక్షలంటోంది. మధ్యధరా సముద్ర తీరానవున్న గాజా స్ట్రిప్ అనే చిన్న ప్రాంతాన్ని వదిలి రావటానికి ససేమిరా అంటున్న స్థానికులను హతమార్చయినా ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ ప్రయ త్నిస్తోంది. ఆ ప్రాంతాన్ని సైతం తమ దేశంలో విలీనం చేసుకోవాలన్నది దాని ఆంతర్యం. గతంలో పాలస్తీనాపై విరుచుకుపడినప్పుడల్లా ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని 51వ అధికర ణాన్ని ఇజ్రాయెల్ ప్రస్తావించేది. సాయుధ మూకలు దాడులకు దిగితే ఆత్మరక్షణ చేసుకునే హక్కు దేశాలకుంటుందని ఆ అధికరణ చెబుతోంది. కానీ పాలస్తీనాలో తనదికాని భూభాగాన్ని ఆక్రమించుకుని, దాన్ని విస్తరించాలనుకున్నప్పుడల్లా ఇజ్రాయెల్ ఈ అధికరణను సాకుగా చూపుతోంది. హమాస్ సంస్థ దాడుల్ని ఎవరూ సమర్థించరు. ప్రజల కోసం పోరాటం చేస్తున్నామని చెబుతూ వారికే నష్టం కలిగించే ఆ సంస్థ చర్యల్ని మొదటినుంచీ అందరూ వ్యతిరేకి స్తున్నారు. కానీ గత 21 నెలలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండ మాటేమిటి? కేవలం 365 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల చిన్న ప్రాంతంపై యుద్ధ విమానాలతో, బాంబులతో, క్షిపణులతో దాడులు సాగించటం ఏ అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం సబబవుతుంది? ఇజ్రాయెల్ మిత్ర దేశమన్న సాకుతో పెద్ద పెద్ద దేశాలే అది సాగిస్తున్న మారణకాండను విస్మ రిస్తున్న తరుణంలో ఇటీవల 12 చిన్న దేశాలు కొలంబియాలోని బగోటాలో అత్యవసర శిఖరాగ్ర సదస్సు నిర్వహించి కార్యాచరణకు దిగబోతున్నట్టు ప్రకటించటం ఉన్నంతలో ఊరటనిచ్చే అంశం. బొలీవియా, కొలంబియా, క్యూబా, ఇండొనేసియా, ఇరాక్, లిబియా, మలేసియా, నమీ బియా, నికరాగువా, ఒమన్, సెయింట్ విన్సెంట్, దక్షిణాఫ్రికాలు వీటిలో వున్నాయి. ఈ సమావేశానికి హాజరైనా, అది విడుదల చేసిన సంయుక్త ప్రకటనపై సంతకం చేయాలా వద్దా అన్న మీమాంసలో పడిన మరో 20 దేశాలు వచ్చే సెప్టెంబర్‌కల్లా ఏ సంగతీ తేల్చాలని సదస్సు గడువు విధించింది. ఇజ్రాయెల్‌పై దక్షిణాఫ్రికా ఇప్పటికే అంతర్జాతీయ నేర న్యాయస్థానంలో ఫిర్యాదు చేసింది. తనదికాని ఒక ప్రాంతంపై దండెత్తి, అక్కడి పౌరులు ఎటువైపు కదలాలో హుకుం జారీ చేసే ఇజ్రాయెల్ ఆగడం నాగరిక ప్రపంచ ఉనికికే పెను సవాలు. ఇజ్రాయెల్ ఇష్టారాజ్యంగా మానవ హననానికి పాల్పడుతుంటే చూస్తూ కూర్చున్న దేశాలకు కూడా రేపన్నరోజు ఇదే గతి పట్టదన్న గ్యారెంటీ ఏం లేదు. అందుకే అంతర్జాతీయ చట్టాలకూ, ఐక్యరాజ్యసమితి చార్టర్లకూ, మానవ హక్కులకూ ఇజ్రాయెల్ పెనుముప్పుగా మారిందని 12 దేశాల సదస్సు వ్యాఖ్యానించింది. అయితే ఇజ్రాయెల్ ఏం చేసినా సమర్థించటం అలవాటైన అమెరికాను కాదని ఎన్ని దేశాలు ఈ సదస్సుతో గొంతు కలుపుతాయన్నది ప్రశ్నార్థకం. ఇప్పటికే 'ఇంకా' సంతకం చేయని దేశాలకు దూతల్ని పంపి 'దారికి తేవాలని' అమెరికా నిర్ణయించుకుంది. ఈ సదస్సుపై ట్రంప్ కారాలూ మిరియాలూ నూరుతున్నారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఉనికిలోకొచ్చిన అంతర్జాతీయ సంస్థలు మొదటినుంచీ ద్వంద్వ ప్రమాణాలతో వ్యవహరిస్తున్నాయి. అందరికీ ఒకే న్యాయం భావన వదిలి సంపన్న దేశాలతో ఒక విధంగా, బడుగు దేశాలతో మరో రకంగా ప్రవర్తిస్తున్నాయి. అందువల్లే ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి తదితర వేదికలపై ఇప్పుడెవరికీ పెద్దగా భ్రమలు లేవు. ఉన్నంతలో కొలంబియా సదస్సు ఒక ఆశాకిరణం. ఆహార పంపిణీ కేంద్రాలు ఐక్యరాజ్యసమితి సంస్థల కనుసన్నల్లోనే వుంటున్నా అవి పాలస్తీనా ప్రజల పాలిట ఉచ్చుగా మారుతున్నాయి. ఆసుపత్రులు, శరణార్థ శిబిరాలు మాత్రమే కాదు.. చివరకు ఆహార పంపిణీ కేంద్రాలు సైతం ఇజ్రాయెల్ సైనికుల దాడులకు లక్ష్యమవుతున్నాయి. ఆకలితో నకనకలాడుతూ తిండికోసం జనం ఒకచోట గుమిగూడినప్పుడు కాల్చి చంపితే గాజాను ఖాళీ చేయించాలన్న తమ పథకం పారుతుందని ఇజ్రాయెల్ భావిస్తున్నట్టుంది. ఒకనాడు నాజీ జర్మనీ లక్షలాదిమంది యూదుల్ని చిత్రహింసల శిబిరాలకు చేర్చి అమానుషంగా అంతమొందించింది. ఆ తరహాలోనే పాలస్తీనాలో రఫా వంటి చోట్ల శిబిరాల నిర్మాణం మొదలైంది. మరో జనహననాన్ని నాగరిక ప్రపంచం సహిస్తుందా? ప్రపంచ ప్రజానీకం మేల్కొని తమ తమ దేశాల్లోని ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తే తప్ప ఇజ్రాయెల్ దురాగతాలు ఆగవు.

# ఎరువుల కోసం ఎతలు



రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల కోసం రైతులు డిపోల వద్ద పడిగాపులు పడుతున్న దృశ్యాలు నిత్యకృత్యమైపోతున్నాయి. ముఖ్యంగా యూరియా కొరత సంక్షోభంగా పరిణమిస్తున్నది. ఎరువుల డిపోల వద్ద పెద్ద సంఖ్యలో రైతులు గుమిగూడుతుండటంతో పోలీసు భద్రత ఏర్పాటుచేయాల్సి వస్తుండటం గమనార్హం. అర్ధరాత్రి నుంచే రైతులు బారులు తీరడం, కొన్నిచోట్ల చెప్పులు, సంచులు క్యూలైన్లలో ఉంచడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. పలుచోట్ల ఓపిక నశించిన రైతులు నిరసనలకూ దిగుతున్నారు. తగినంత ఎరువు సరఫరా చేయడంలో కేంద్రం విఫలమైందని రాష్ట్ర ప్రభుత్వం అంటుంటే, పంపిణీ వ్యవస్థ సవ్యంగా పనిచేయడం లేదని, మరోవైపు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్నారని కేంద్రం ఆరోపిస్తున్నది. ఇస్తినమ్మ వాయినం తరహాలో ఇరుపక్షాలూ ఒకరి మీద మరొకరు నెపం మోపాలని చూస్తున్నాయి. మధ్యలో రైతాంగం నలిగిపోతున్నది. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే 3 లక్షల టన్నులు మాత్రమే అందింది. ఈ లోటును ఆసరాగా చేసుకొని వ్యాపారులు బ్లాక్ మార్కెట్లో ఒక్కో యూరియా బస్తా సబ్సిడీ ధర రూ.268 అయితే రూ.325 వరకు ధర పెంచి అమ్మేస్తున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. ప్రస్తుత జూలై మాసంలో యూరియా కొరత తీవ్రరూపం దాల్చింది. ఎరువుల అవసరాలు ఎక్కువయ్యేది ఇప్పుడే కావడంతో సాగు అగమ్యగోచరంగా తయారైంది. సమస్య ఏప్రిల్ మాసంలో మొదలైతే జూలై మూడోవారం వరకూ దిద్దుబాటు జరుగకపోవడం సర్కారు నిర్లక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనం. వానకాలం సాగుపై ఈ కొరత తీ వ్ర ప్రభావం చూపవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్‌ఎస్ హయాం లో పండుగలా సాగిన సాగు ఇప్పుడు సర్వత్రా సమస్యలను ఎదుర్కొంటున్నది. రైతన్న కడగండ్లకు యూరియా కొరత పరాకాష్ఠగా నిలుస్తుంది. యూరియా కొరత పంటల ఎదుగుదల, తద్వారా రైతుల జీవనాధారం మీద దెబ్బకొట్టే ప్రమాదం పొడసూపుతున్నది. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో సాగునీటి పరిస్థితి గణనీయంగా మెరుగుపడటం, రైతుబం ధు పేరిట పంట పెట్టుబడి, సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు కావాల్సినం త సరఫరా చేయడం వంటి రైతు అనుకూల విధానాల ఫలితంగా సాగు విస్తీర్ణం పెరిగింది. యూరియా ఎక్కువగా అవసరమయ్యే వరి, పత్తి పంటల సాగు గరిష్ఠ స్థాయికి చేరుకున్న ది. దేశంలో ఎరువుల వినియోగంలో తెలంగాణ 5వ స్థానంలో ఉన్నది. గత యాసంగిలో యూరియా వినియోగం అంతకు ముందరి ఏడాదితో పోలిస్తే 21 శాతం పెరిగింది. సాగు అవసరాల దృష్ట్యా సీజన్‌కు ముందే అప్పటి సీఎం కేసీఆర్ తగిన అంచనాలు వేసి కేంద్రం నుంచి కోటా రాబట్టడమే కాకుండా రవాణా కు సంబంధించిన అంశాలూ కచ్చితంగా చూసుకునేవారు. రైల్వే ర్యాకులు కేటాయించుకోవడంలో ఆయన చూపిన శ్రద్ధ గురించి ఇప్పటికీ చెప్పుకొంటారు. కానీ ప్రస్తుత పాలకుల్లో రైతాంగం పట్ల ఆ తరహా అంకితభావం కొరవడింది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా కొరత ఏర్పడిన తర్వాత ప్రభుత్వం తీరిగ్గా ఆలోచిస్తున్నది. మొక్కుబడి ప్రకటనలతో సరిపెడుతున్నది. అటు కేంద్రం కూడా సందట్లో సడేమియా అన్నట్టుగా రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేం ద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని నీతిబోధలకు దిగుతుండటం విడ్డూరం.

# రాజకీయ పార్టీలకు ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష వంటివే..




తెలంగాణ రాజకీయాలు ప్రస్తుతం ఒక కీలకమైన దశలో ఉన్నాయి. గత దశాబ్దంలో ఆధిపత్యం వహించిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పలుకుబడి తగ్గుముఖం పట్టడం, కాంగ్రెస్ అధికారం లోకి రావడం, బీజేపీ రాష్ట్రంలో ఒక ప్రధాన శక్తిగా ఎదగడంతో రాజకీయ సమీకరణలు సరికొత్త రూపం సంతరించుకున్నాయి. ఈ త్రిముఖ పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య ప్రజలకు ఎక్కువ రాజకీయ ప్రత్యామ్నాయాలను అందిస్తూ, పార్టీల బాధ్యతను పెంచే అవకాశం ఉంది. అదే సమయంలో అస్థిరతకు దారితీసే ప్రమాదం కూడా ఉంది.

విద్యా వికాసానికి విద్యా మంత్రి బాటలు!

పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు తెరదించి, తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఒకవైపు ప్రజాకర్షక పథకాలతో ముందుకు దూసుకెళ్తుంటే, మరోవైపు అంతర్గత, బాహ్య సవాళ్లు కూడా ఆ పార్టీకి ఎదురవుతున్నాయి. అధికార బలం ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉండటం కాంగ్రెస్ పార్టీకి అతిపెద్ద బలం. ప్రభుత్వ యంత్రాంగం చేతిలో ఉండటంతో విధానపరమైన నిర్ణయాలు వేగంగా తీసుకోవడానికి, ప్రజలకు నేరుగా చేరువ కావడానికి అవకాశం లభించింది.

హాయిగా బతికేందుకు అవకాశం ఉన్నా బతకలేక..

ప్రజా పాలన బాటలో కాంగ్రెస్

ఎన్నికల విజయానికి మూలస్తంభమైన ఆరు గ్యారెంటీల అమలును ప్రభుత్వం వేగవంతం చేసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను ఇప్పటికే ప్రారంభించి ప్రజల్లో సానుకూలతను నిలుపు కుంటోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన కార్య క్రమాలతో ప్రజలకు అందుబాటులో ఉంటున్నారనే భావన కల్పిస్తున్నారు. ఆరు గ్యారెంటీల పూర్తిస్థాయిలో అమలు, కాంగ్రెస్ ప్రతిష్ఠకు అత్యంత కీలకం. అయితే కాంగ్రెస్ పార్టీకి సహజంగా ఉండే అంతర్గత కుమ్ములాటలు తెలంగాణలోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. అసలైన కాంగ్రెస్ నేతలు, వలస వచ్చిన నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టుల పంపకాల విషయంలో సీనియర్లలో అసంతృప్తి ప్రభుత్వ స్థిరత్వానికి సవాలుగా మారవచ్చు.

అక్షర సేనాని దాశరథి

బీఆర్ఎస్ నుండి గెలిచిన ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు కాంగ్రెస్‌లో చేరడం పార్టీకి సంఖ్యాబలాన్ని పెంచుతున్నా, వారిని సంతృప్తి పరచడం పెద్ద సమస్యగా మారింది. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మొదటి అసలైన పరీక్ష. ఈ ఎన్నికల్లో గెలుపు, ప్రభుత్వ పని తీరుపై ప్రజల తీర్పుగా భావించబడుతుంది. ఈ ఎన్నికలే కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయాలకు దిక్సూచిగా నిలవనున్నాయి.

ప్రైవేట్ ప్రయాణ సర్వీసుల ధరలు నియంత్రించాలి!

ప్రమాదంలో బీఆర్ఎస్ భవిష్యత్తు

తెలంగాణ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలుగొందిన బీఆర్ఎస్, ప్రస్తుతం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. వరుస ఓటములు, అంతర్గత కలహాలు, న్యాయపరమైన చిక్కులు పార్టీ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తు న్నాయి. వరుస ఓటములు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికా రం కోల్పోవడం, ఆ తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోవడం బీఆర్ఎస్‌ను కోలుకోలేని దెబ్బ తీశాయి. ఈ ఓటములతో పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లో కొంత ఒత్తిడి నెలకొంది. పార్టీ శ్రేణుల్లో నిరాశ, ఓటముల తర్వాత చాలా మంది సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీకి దూరంగా ఉండటం ఇతర పార్టీలలోకి వెళ్లడం వంటి పరిణామాలు జరుగుతున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను బీఆర్ఎస్ తమ పునరుజ్జీవానికి ఒక అవకాశంగా భావిస్తోంది.

### ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష వంటివే..

క్షేత్రస్థాయిలో పార్టీకి ఇంకా పట్టు ఉందని, ఈ ఎన్నికల్లో గెలిచి బలాన్ని నిరూపించుకోవాలని ఆశిస్తోంది. అయితే, పార్టీలోని అంతర్గత కలహాలు ఈ అవకాశాలకు గండి కొట్టేలా ఉన్నాయి. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం వంటి అంశాలపై తీవ్ర ఆరోపణలు బీఆర్ఎస్‌పై నైతికంగా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా పార్టీ ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను హరించిన, సొంత నాయకులను నమ్మని పార్టీగా ముద్రపడే ప్రమాదం ఉంది. తదుపరి విచారణ ఫలితాలు బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపవచ్చు. అయితే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్‌కు ఒక అగ్నిపరీక్ష లాంటివి. ఈ ఎన్నికల ఫలితాలే తెలంగాణలో పార్టీ భవిష్యత్తును నిర్దేశించనున్నాయి.

బీఆర్ఎస్ బలహీనతే బీజేపీ బలం

గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ బీజేపీ ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయినప్పటికీ, 2024 లోక్‌సభ ఎన్నికలలో 8 స్థానాలు గెలుచుకొని, అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో సమానంగా నిలిచి సంచలనం సృష్టిం చింది. ఈ విజయం, ఓట్ల శాతంలో గణనీయమైన పెరుగుదలతో పాటు, పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఈ ప్రదర్శన బీజేపీని రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బలమైన ప్రత్యామ్నాయంగా స్థిరపరచడంలో కీలక పాత్ర పోషించింది. అయితే, అంతర్గత సవాళ్లు పార్టీ పురోగతికి అడ్డంకులుగా మారుతున్నాయి. నాయకత్వ విభేదాలు, సంస్థాగత సమన్వయ లోపాలు, స్థానిక నాయకుల మధ్య పోటీలు వంటి సమస్యలు బీజేపీని కలవరపరుస్తున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ క్రమంగా బలహీనపడటం బీజేపీకి రాజకీయంగా కలిసి వస్తోంది. బీఆర్ఎస్ స్థానాన్ని ఆక్రమించి, కాంగ్రెస్‌కు ఏకైక, బలమైన ప్రత్యామ్నాయంగా నిలవడానికి బీజేపీకి మార్గం సుగమమైంది. తెలంగాణలో బీజేపీకి కొన్ని పట్టణ ప్రాంతాలు, కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే బలమైన స్థానం ఉంది, కానీ గ్రామస్థాయిలో బలమైన కేడర్ వ్యవస్థ ఇంకా ఏర్పడలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి ఇది ప్రధాన కారణాల్లో ఒకటిగా చెప్పవచ్చు. రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు నియామకం వల్ల కలిగిన అసంతృప్తి వంటి అంశాలు పార్టీ ఐక్యత, భవిష్యత్ విజయాలకు అడ్డంకులుగా ఉన్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ భవిష్యత్ ప్రస్థానానికి ఒక లిట్మస్ టెస్ట్‌గా నిలుస్తాయి.

## రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ లో

# ఏర్పాట్లను పూర్తి చేయాలి..

జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మరియు డైరెక్టర్ ఆర్ . టి .ఐ.హెచ్.



అనంతపురం, : జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ అతి త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని విధాలా ఏర్పాట్లను సత్వరమే పూర్తి చేయాలని జిల్లా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ మరియు రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ శివ్ నారాయన్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సహార్ తో కలిసి అనంతపురం నగరంలోని జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్ లో ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ ఇప్పటివరకు జరిగిన పనుల గురించి సమీక్షించారు.రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను త్వరలో ప్రారంభించడంజరుగుతుందనితెలిపారు.దీనికై అవసరమైన మేరకు అన్ని రకాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బిల్డింగ్ సెంటర్ పరిసరాలను ను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏవైనా పెండింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు సెంటర్ లో ఇప్పటివరకు జరిగిన పనుల నాణ్యతను పరిశీలించారు. అలాగే విద్యార్థుల తరగతి గదులు, కాన్ఫరెన్స్ హాల్, ఇతర గదులనుపరిశీలించారు. సెంటర్ లో అవసరమైన మేరకుమౌలికసదుపాయాలతో పాటు ఇన్ఫ్రాస్ట్రక్చర్ ను ఏర్పాటు చేయాలని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే బోర్డు సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, టాస్క్ ఫోర్స్ బృందంతో ఎం ఎస్ ఎం ఈ సమావేశం నిర్వహణ ను జిల్లా పరిశ్రమల శాఖ, గ్రామ వార్డు సచివాలయ సమన్వయకర్త తదితర అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారికి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సెంటర్ ఓ.ఎస్. డి .దీప్తి, ఆర్.అండ్.బి. ఎస్.ఈ మురళీకృష్ణ, డిఈ వి.రాజగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, ఉద్యాన శాఖ డిడి ఉమాదేవి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ఆర్.అండ్.బి జెఈ బాల కాటమయ్య, హార్టికల్చర్ అధికారి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం .

పుట్టపర్తి మున్సిపాలిటీలో నిర్వహించిన ఇంటింటి కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి .



పుట్టపర్తి :ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బడే నాయక్ తండా, గోనె నాయక్ తండా లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఇంటింటికి కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు.గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను 90 శాతం తూచా తప్పకుండా అమలు చేశామని పేర్కొన్నారు. ఇంకా అర్హులైన వారు ఉంటే ఈ ఇంటింటికి కార్యక్రమంలో వారిని గుర్తించి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే గతంలో పేదలకు ఇస్తున్న 3000 పెన్షన్ 4000 కు పెంచామని తెలిపారు. అదేవిధంగా ఇంట్లో చదివే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం ద్వారా 15000 తల్లి ఖాతాలో మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి ఏటా మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఇవే కాకుండా రాష్ట్రంలో ప్రధానంగా పోలవరం ,అమరావతి రాజధాని నిర్మాణ పనులు చేపట్టి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో పుట్టపర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నెంబర్ 1 గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్పష్టం చేశారు. బడే నాయక్ తండ ,గోనె నాయక్ తండాలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి పథకాలను కరపత్రాలు ద్వారా ప్రజలకు తెలియజేశారు. ఎమ్మెల్యే తో పాటు పుట్టపర్తి మున్సిపాలిటీ కి చెందిన పట్టణ టిడిపి కన్వీనర్ బోయ రామాంజనేయులు టిడిపి సీనియర్ నాయకులు సామకోటి ఆదినారాయణ, పుట్టపర్తి టిడిపి కౌన్సిలర్లు స్థానిక కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# హంద్రీనీవా ద్వారా ముదిగుబ్బ మండలాన్ని సస్యశ్యామలం చేస్తాం

రైతులకు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ హామీ

యోగివేమన రిజర్వాయర్ కు నీరందించే పనుల పరిశీలన

రైతులతో సమావేశం.. అదనంగా గేట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

వీలైనంత ఎక్కువ ప్రాంతానికి నీరందుతుందన్న శ్రీరామ్



ధర్మవరం :హంద్రీనీవా కాలువ ద్వారా ముదిగుబ్బ మండలాన్ని సస్యశ్యామలం చేస్తామని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ముదిగుబ్బ మండలం మలకవేముల దగ్గర హంద్రీనివా కాలువ ప్రాంతాన్ని శ్రీరామ్ పరిశీలించారు. హంద్రీనీవా అధికారులతో పాటు మైనర్ ఇరిగేషన్ అధికారులు, టీడీపీ నాయకులు, రైతులు ఆయన వెంట వచ్చారు. ప్రస్తుతం కాలువ లైనింగ్ జరుగుతున్న నేపథ్యంలో ముదిగుబ్బ మండలంలోని యోగివేమన రిజర్వాయర్ తో పాటు పలు చెరువులకు నీరందించేలా రెండు గేట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను శ్రీరామ్ స్వయంగా పరిశీలించారు. అక్కడ రైతులతో



మాట్లాడారు. ఈ రెండు గేట్ల ద్వారా సానేవారిపల్లి చెరువు నుంచి మద్దిలేరు వంక మీదుగా యోగివేమనకు నీరందేలా ప్రణాళిక చేశారు. మార్గమధ్యలో సుమారు చెక్ డ్యామ్ లు,కుంటలకు నీరు అందనుంది. అయితే రైతులు ఇంకా కొన్ని ప్రాంతాలకు నీరందించాలని శ్రీరామ్ కు విజ్ఞప్తి చేశారు. రైతుల విజ్ఞప్తి మేరకు కాలువకు మరో రెండు గేట్లు అదనంగా పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ విషయంపై జలవనరులశాఖ మంత్రితో పాటు హంద్రీనీవా అధికారులతో మాట్లాడుతామన్నారు. ముదిగుబ్బ మండలంలో మొదటి నుంచి సాగు, తాగునీటి సమస్య ఉందన్నారు. గత ఐదేళ్లలో దీనిని ఎవరూ పట్టించుకోలేదని.. ఎన్నికల ముందే తాము హామీ ఇచ్చిన విధంగా ఇక్కడ సాగు, తాగునీటి సమస్య తీరుస్తామన్నారు. హంద్రీనీవా కాలువకు లైనింగ్ చేస్తున్న నేపథ్యంలో చెరువులకు, రిజర్వాయర్ కు నీరందించే విధంగా గేట్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రాంతంలో వీలైనంత ఎక్కువ చెరువులకు, భూములకు నీరందిస్తామన్నారు. రానున్న రెండేళ్లలో ఈ ప్రాంతంలో నీటి సమస్య తీరుతుందని శ్రీరామ్ అన్నారు...

### టీడీపీ నాయకుడికి పరిటాల శ్రీరామ్ పరామర్శ

ముదిగుబ్బ మండలం మలకవేముల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బండి మల్లికార్జున కుమారుడు రూపేంద్ర ఇటీవల ప్రమాదవశాత్తు మరణించాడు. విషయం తెలుసుకున్న శ్రీరామ్ గ్రామంలోని మల్లికార్జున ఇంటికి వెళ్లారు. మల్లికార్జునతో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూపేంద్ర మరణం చాలా బాధాకరమని శ్రీరామ్ అన్నారు. ధైర్యంగా ఉండాలని మల్లికార్జున కుటుంబసభ్యులను ఓదార్చారు...

# 100 శాతం అక్షరాస్యత సాధించండి !

ఉల్లాస్ చైతన్యం..గడప గడపకు విద్య!

2025-26 సంవత్సరానికి మన జిల్లాకు 93,886 మంది

నిరక్షరాస్యులను అక్షరాస్యులు గా తీర్చిదిద్దడమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్



పుట్టపర్తి, : "100 శాతం అక్షరాస్యతే లక్ష్యం .. ఉల్లాస్ చైతన్యంతో గడపగడపకూ విద్య" ను అందించాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ పిలుపునిచ్చారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ అధ్యక్షతన.. జిల్లాలో రెండవ విడత "ఉల్లాస్" కార్యక్రమం నిర్వహణపై.. జిల్లా స్థాయి కమిటీ కన్వర్జెన్స్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే "ఉల్లాస్" కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి శ్రీ సత్యసాయి జిల్లాలో 15,954 మంది వయోజన నిరక్షరాస్యులను లక్ష్యంగా పెట్టుకుని అమలైన అక్షరాస్యత కార్యక్రమం విజయవంతమైందన్నారు. 1,595 మంది స్వచ్ఛంద ఉపాధ్యాయుల సహకారంతో బోధనా తరగతులు నిర్వహించబడి మొత్తం 13,985 మంది పరీక్షలకు హాజరుకాగా, 13,731 మంది (98%) విజయవంతంగా ఉత్తీర్ణత సాధించారన్నారు.ఇప్పటికే సాధించిన ఈ పురోగతిపై , రాష్ట్ర ప్రభుత్వం "అక్షర ఆంధ్ర" అనే ప్రత్యేక అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా 2029 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం వయోజన జనాభా కార్యాచరణాత్మక అక్షరాస్యతను పొందేలా చేయడం లక్ష్యంగా నిర్ణయించిదన్నారు.2025-26 సంవత్సరానికి మన శ్రీ సత్యసాయి జిల్లాకు 93,886 మంది నిరక్షరాస్యులను లక్ష్యంగా నిర్ణయించి బోధనా తరగతులు నిర్వహించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా మహిళలు, పురుషులకు చదవడం, రాయడం, ప్రాథమిక గణితం, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ లక్ష్య సాధనలో సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు.కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, డ్వామా (%వీ+చీ-=జు+గా%), జిల్లా ప్రణాళిక శాఖ, మేప్మా వంటి సంస్థల సహకారం కీలకం కానుందని, ముఖ్యంగా, నిరక్షరాస్యులను గుర్తించి వారికి స్వచ్ఛందంగా బోధించేందుకు ఉపాధ్యాయులను ఎంపిక చేసి, వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు.కార్యాచరణ ప్రణాళిక ఆగస్టు 7: అక్షరాస్యత కేంద్రాల ప్రారంభం ఫిబ్రవరి 2026: బోధనా తరగతుల ముగింపు మార్చి 2026: అక్షరాస్యత పరీక్షలు నిర్వహణ జూలై 26లోపు: ఒక్కో వాలంటీర్ ఉపాధ్యాయునికి 10 మంది నిరక్షరాస్యులు జత చేసి, సమగ్ర నివేదికలు సమర్పించాలి ప్రతి నిరక్షరాస్యునికి రెండు పాఠ్య పుస్తకాలు, దృశ్య-శ్రవణ శిక్షణ వీడియోలు ఉచితంగా అందుబాటులోకి తేవాలని తెలిపారు,ఈ కార్యక్రమంలో వయోజన విద్యా శాఖ డిడి యస్. వెంకటేశ్వర్లు, జడ్పి సీఈఓ శివశంకర్, డ్వామ విజయప్రసాద్, ఐసీడీఎస్ పీడీలు శ్రీదేవి,డీ ఈ ఓ కిష్టప్ప, జి ఏ స్ డ బ్లూ ఎస్ నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, స.పౌ.శాఖఅసిస్టెంట్ డైరెక్టర్

# తోతాపూరి మామిడి రైతులకు తీపికబురు

క్వింటాకు రూ.1,490 ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

50:50 నిష్పత్తిలో కేంద్రం, ఏపీ రాష్ట్రం మద్దతు ధరను చెల్లించనున్నాయి

నేరుగా రైతుల ఖాతాల్లో జమ కానున్న నగదు

ఫలించిన మంత్రి అచ్చెన్నాయుడు కృషి

సీఎం చంద్రబాబు నాయుడుకి, మంత్రి అచ్చెన్నాయుడుకి కృతజ్ఞతలు తెలిపిన మామిడి రైతులు



విజయవాడ : తోతాపూరి మామిడి రైతుల పక్షాన కూటమి ప్రభుత్వం నిలబడిన విషయం తెలిసిందే. ఈ సంవత్సరం అత్యధిక దిగుబడి రావడంతో మామిడి ధర తగ్గుముఖం పట్టింది. ఈ విషయాన్ని ముందే గ్రహించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చిత్తూరు జిల్లాలో విస్తృతంగా పర్యటించి రైతులతో, పల్ప్ ఫ్యాక్టరీ ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను సేకరించారు. దిగుబడి ఎక్కువ ఉండటంతో మామిడి పంటను పల్ప్ ఫ్యాక్టరీలు తక్కువ ధరకు అడుగుతున్నారని తెలుసుకున్న మంత్రి అచ్చెన్నాయుడు వెంటనే ఈ సమస్యను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు పల్ప్ ఫ్యాక్టరీలు కేజీ మామిడిని 8 రూ కొనాలని, 4 రూ సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తుందని తెలిపారు. కేజీ 12 రూ చొప్పున రైతులకు అందచేసే విధంగా చర్యలు తీసుకున్నారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ పర్యటనకు వెళ్లిన మంత్రి అచ్చెన్నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను కలసి తోతాపూరి మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించి సబ్సిడీ నగదులో 50:50 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగదును చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

### మామిడి రైతులకు అండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

మంత్రి అచ్చెన్నాయుడు అభ్యర్థనని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం మంగళవారం తోతాపూరి మామిడి క్వింటాకు రూ.1,490 ను కేంద్రం ప్రకటించింది. 50:50 నిష్పత్తిలో కేంద్రం, ఏపీ రాష్ట్రం మద్దతు ధరను చెల్లించనున్నాయి. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ కానుంది. ఈ విషయం పట్ల తోతాపూరి మామిడి రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. రైతుల పక్షాన నిలబడిన కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబునాయుడు కి, మంత్రి అచ్చెన్నాయుడు కి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

### హర్షం వ్యక్తం చేసిన మంత్రి అచ్చెన్నాయుడు

తోతాపూరి మామిడి క్వింటాకు రూ.1,490 ను కేంద్రం ప్రకటించడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మామిడి రైతుల నష్టం రాకూడదని ముందుగానే గ్రహించి కేజీ మామిడిని 12 రూ లకు కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేజీ మామిడికి 4 రూ సబ్సిడీ ని అందచేశామని అన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పోలిస్తే మెరుగైన ధరను మామిడి రైతులకు ఏపీ ప్రభుత్వం అందచేసిందని తెలిపారు. మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిన సీఎం చంద్రబాబునాయుడు , కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లకు మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు

## *భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించండి*




అక్టోబర్ 15 నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

దేశ విదేశాల నుంచి ప్రముఖులు వచ్చే అవకాశం..

భద్రత, వసతులపై అధికారులు అప్రమత్తం

స్పెషల్ చీఫ్ సెక్రటరీ , టూరిజం, కల్చర్ అజయ్ జైన్

సత్యసాయి బాబా శతజయంతి వేడుకలకు జిల్లాలో ముమ్మర ఏర్పాట్లు

అధికారులందరూ సంయుక్తంగా పనిచేసి బాబా జయంతి వేడుకలను విజయవంతం చేయండి

జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

పుట్టపర్తి, :భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను అక్టోబర్ 15 నాటికి పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ ఆదేశించారు మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం, పిజిఆర్ ఎస్ హాలు నందు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకల నిర్వహణ సందర్భంగా ముందస్తు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ తో కలసి ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, టూరిజం, కల్చర్ అజయ్ జైన్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న అజయ్ జైన్ మాట్లాడుతూ..ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందన్నారు. రాష్ట్రం గర్వపడే విధంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, రోజుకు కనీసం 10,000 మంది, ముఖ్యమైన రోజుల్లో గరిష్ఠంగా 60,000 నుండి 70,000 మందివరకు భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు ఒకేసారి గరిష్టాంగ ఎంత మంది భక్తులు రానున్నారో అంచనా వేసి అవసరమైన వసతులు కల్పించే దిశగా కార్యాచరణ రూపొందించాలి. భక్తులు స్థానికంగా, ఉమ్మడి జిల్లాలు, మన రాష్ట్రం నుండే కాకుండా బెంగళూరు, హైదరాబాద్ వంటి ఇతర నగరాల నుంచీ, దేశ, విదేశాల నుండి కూడా భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఇందుకు తగ్గట్లు రవాణా ఏర్పాట్లు, వసతుల కల్పన ముమ్మరంగా చేయాలన్నారు.అన్ని అభివృద్ధి పనులు అక్టోబర్ 15 నాటికే పూర్తవ్వాలి. అన్ని శాఖలూ తగిన ముందుచూపుతో పథకాలు చేపట్టి, సెప్టెంబర్ 30 నాటికి కనీసం 90 శాతం పనులను పూర్తిచేయాలి. అనంతరం మిగిలిన పనులు చివరి వారంలోపు పూర్తిచేయాలన్నారు.భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, శానిటేషన్, మొబైల్ టాయిలెట్లు, వీధిదీపాలు వంటి ప్రాథమిక సదుపాయాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణం పరిశుభ్రంగా ఉండేలా డస్ట్ బిన్లు, వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజ్ వ్యవస్థలు కూడా సమర్థవంతంగా ఏర్పాటు చేయాలన్నారు. వీటితో పాటు ఫుడ్ కౌంటర్లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, అదనపు సిబ్బంది నియామకం కూడా ముందుగానే పరిగణనలోకి తీసుకుని కేటాయించుకోవాలన్నారు.రవాణా దృష్ట్యా, బెంగళూరు నుంచి పుట్టపర్తికి వచ్చే రోడ్డు మార్గాలను గుంతలు లేకుండా అభివృద్ధి చేయాలి. ముఖ్యంగా పెనుకొండ కొత్త చెరువు మార్గం, బ్రాహ్మణపల్లి %-% ఏనుముల పల్లి మార్గాలను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలన్నారు. . ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ ఉండేలా ఇంటర్నల్ రింగ్ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ , పార్కింగ్ సౌకర్యాలు తగినంతగా ఏర్పాటు చేయాలన్నారు.జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ మాట్లాడుతూ.. శ్రీ సత్యసాయి బాబా జయంతి కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటికే సమీక్షలు జరిపి అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. తమరి ఆదేశాల మేరకు సెక్యూరిటీ ప్లాన్‌ను సమగ్రంగా సిద్ధం చేస్తామన్నారు. భక్తుల రాకపోకలు, ముఖ్య ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, పటిష్ఠమైన పహారా ఏర్పాట్లపై స్పష్టమైన కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో అన్ని చర్యలు తీసుకుని ఈ ఉత్సవాలు దిగ్విజయం చేస్తామన్నారు.జిల్లా ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ...భద్రత పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, అత్యవసర వాహనంతో పాటు సిసిటివి కెమెరాలు, బాడీ ఓన్ కెమెరాలు, డాగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. కమ్యూనికేషన్ కోసం రిపీటర్ స్టేషన్, పార్కింగ్ ప్రాంతాల్లో కెమెరాలు, సైన్‌బోర్డులు అమార్చుతామని, సెంట్రల్ కమాండ్ కంట్రోల్ నుండి క్విక్ రియాక్షన్ టీమ్‌లు క్షణక్షణం పర్యవేక్షణలో ఉంటాయని తెలిపారు.పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం శ్రీ సత్యసాయిబాబా 100వ జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు.ఈ సందర్భంగా పుట్టపర్తి పట్టణ సుందరీకరణతో పాటు ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.105 కోట్లు అంచనా వ్యయంతో డీపీఆర్‌ను ప్రభుత్వంకు పంపించినట్టు తెలిపారు. జయంతి వేడుకల నేపథ్యంలో అవసరమైన కార్యక్రమాలన్నింటికీ విస్తృత ప్రణాళికతో ముందుకు సాగనున్నట్లు పేర్కొన్నారు.అంతకు ముందు శ్రీ సత్యసాయిబాబా 100వ జయంతి వేడుకల నిర్వహణకు జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలపై జేసి అభిషేక్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో విజయసారధి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ట్రస్టు సభ్యులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL
బుధవారం- 23 - జూలై- 2025

## రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు ఎంపిక



ధర్మవరం. రూరల్. :ధర్మవరం మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ విద్యార్థులు ఈనెల 20వ తేదీన అనంతపురం కొత్త ఊరు జూనియర్ కళాశాలలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ కు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం లభించిందని హెడ్మాస్టర్ జగన్నాథం ఫిజికల్ డైరెక్టర్ రమేష్ బాబు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సబ్ జూనియర్ జట్టుకు 9వ తరగతిలో సాయి జాహ్నవి, జయవర్ధన్, జూనియర్ జట్టుకు 9వ తరగతిలో వినయ్, కమలాక్షి ఎంపిక కావడం జరిగిందన్నారు. ఎంపికైన వారు సబ్ జూనియర్స్ ఆగస్టు నెలలో ప్రకాశం జిల్లాలో జరిగే పోటీలలో, జూనియర్స్ వారు శ్రీ సత్యసాయి జిల్లాలలో జరిగే పోటీలలో అనంతపురం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు అని తెలిపారు. అనంతరం హెడ్మాస్టరు ఫిజికల్ డైరెక్టర్ పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

## సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏంపిక.




ధర్మవరం.:పట్టణంలో ఎన్జీవో హోమ్ లో టౌన్ మహాసభలు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ , చేనేత,చేతి వృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షులు జింకా చలపతి హాజరయ్యారు. సిపిఐ టౌన్ నూతన కమిటీ సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు అధ్యక్షతన టౌన్ కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది. టౌన్ కార్యవర్గ సభ్యులు అంతా కలిసి ఏకగ్రీవంగా పట్టణ కార్యదర్శిగా 2,వ సారి పూలశెట్టి రవికుమార్ ని ఎన్నుకోవడం జరిగింది. అలాగే రెండోసారి . సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శిగా ఎర్రంశెట్టి రమణ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. శ్రీనివాసులును నూతన సహాయ కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. టౌన్ కార్యవర్గ సభ్యులుగా వెంకటస్వామి, వెంకటనారాయణ, రాజా,చెన్నంపల్లి శ్రీనివాసులు, శ్రీధర్, ఆదినారాయణ, శ్రీనివాసులు, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, తాజుద్దీన్, మసూద్, ఈశ్వర్,జనార్ధన్ లలితమ్మ,లింగమ్మ, తదితరులను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం నూతన కమిటీని అందరూ ఘనంగా సన్మానించారు. నూతన కమిటీ వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సిపిఐ ఆధ్వర్యంలో పోరాడుతామని తెలిపారు.


## అగ్రిగోల్డ్ ఆస్తుల యొక్క భౌతిక ధృవీకరణ పూర్తి చేసి రికార్డులు సిద్ధంగా పెట్టుకోవాలి

### డిఆర్ఓ ఏ.మాలోల



అనంతపురం, :జిల్లాలో అగ్రిగోల్డ్ ఆస్తుల యొక్క భౌతిక ధృవీకరణ పూర్తి చేసి రికార్డులు సిద్ధంగా పెట్టుకోవాలని డిఆర్ఓ ఏ.మాలోల సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో అగ్రిగోల్డ్ ఆస్తులపై సంబంధిత కమిటీ మెంబర్లతో డిఆర్ఓ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ప్రయివేట్ లిమిటెడ్ డిపాజిట్స్ కు సంబంధించిన ఆస్తుల అటాచ్మెంట్ పై జిల్లాస్థాయిలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులకు సంబంధించి భౌతిక ధృవీకరణ పూర్తిచేసుకుని రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని, సబ్ రిజిస్టర్ విలువ, మార్కెట్ విలువ గుర్తింపు చేయాలని, అగ్రిగోల్డ్ ఆస్తుల మ్యుటేషన్ సంబంధించిన అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం అగ్రిగోల్డ్ భూముల పరిస్థితి ఏంటి, ఆక్రమణలు, కోర్టు కేసులు, తదితర అంశాలకు సంబంధించి పరిశీలన చేయాలన్నారు. సంబంధిత కమిటీ మెంబర్లతో వాట్సాప్ గ్రూప్ తయారు చేయాలన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, సంబంధిత తహసీల్దార్ లు, సబ్ రిజిస్ట్రార్లు అన్ని వివరాలను సిద్ధంగా పెట్టుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు యుగేశ్వరిదేవి, వసంతలత, రియాజుద్దీన్, కర్నూల్ సిఐడి ఇన్స్పెక్టర్ ప్రీతం రెడ్డి, సిఐడి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అశోక్, సిఐడి ఎస్ఐ శివకుమార్ నాయక్, జిల్లా రిజిస్టార్ శ్రీనివాసులు, డిఐపిఆర్ఓ బాలకొండయ్య, ఐటీ ఆఫీసర్ రవి, ఎన్ఐసి డఐవో రవిశంకర్, తహసిల్దార్లు సోమశేఖర్, శేషారెడ్డి, సుమతి, శ్రీనివాసులు, అగ్రిగోల్డ్ ప్రతినిధి ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీలోకి 50 కుటుంబాలు చేరిక.జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి.



ధర్మవరం. రూరల్. : జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి వైసీపీ పార్టీ నుండి జనసేన పార్టీలోకి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన రెడ్డి సమక్షంలో ధర్మవరం మండలం, తుమ్మల గ్రామానికి చెందిన 50 కుటుంబాలు చేరడం జరిగింది. ఈ సందర్భంగా చిలక మధుసూదన్ రెడ్డి పార్టీలో చేరిన వారిని ఘనంగా ఆహ్వానిస్తూ జనసేన పార్టీ కండువాలను వేసి సత్కరించారు. చేరిన వారి పేర్లు ఎం.నారాయణమ్మ, ఎం.శ్వేత, జి.జయమ్మ, జి.నవీన్ కుమార్ రెడ్డి, ఎం..చెన్నారెడ్డి, ఎం.నారాయణరెడ్డి,నాగేంద్ర,రాజశేఖర్, బి.నారాయణస్వామి, శ్రీనివాసులు, అశోక్ మధుసూదన,గణేష్, వరదరాజులు తదితరులు చేరారు.ఈ సందర్భంగా చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియచేసుకుంటూ కార్యకర్తల కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ ఏ ఆపద వచ్చిన ముందు ఉంటానని హామీ ఇచ్చారు.

## సికింద్రాబాద్ కాంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ పై దాడి ...




హైదరాబాద్, :హైదరాబాద్ నగరంలోని సికింద్రాబాద్ కాంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ పై ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) ఆర్టీసీ హాస్పిటల్ సమీపంలో దాడి జరిగింది. సుమారు 15 మంది బైక్‌లపై వచ్చిన వ్యక్తులు ఆయన కారును అడ్డగించి, అద్దాలు పగులగొట్టి, భద్రతా సిబందిలో నుంచి ఆయుధాలను లాక్కొనడానికి ప్రయత్నించారు. ఈ దాడిపై ఎమ్మెల్యే ఒస్మానియా విశ్వవిద్యాలయ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ దాడికి బీఆర్ఎస్ పార్టీ నాయకులే కుట్ర పన్నారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటన మణికేశ్వరనగర్‌లో జరిగిన బోనాల ఫలాహారం బండి ప్రాసెషన్‌లో పాల్గొని తిరిగి వస్తుండగా చోటుచేసుకుంది.

# రానున్న నాలుగేళ్లలో రాప్తాడు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది

### పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకురావడమే లక్ష్యం.. ఎమ్మెల్యే పరిటాల సునీత

### హంపాపురంలో సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత

### పూల బొకేలు, పూలహారాల బదులు నోట్ బుక్స్ అందజేసిన నాయకులు

### గ్రామంలో రైతులకు సబ్సిడీ డ్రోన్ అందజేసిన ఎమ్మెల్యే సునీత



రాప్తాడు : రానున్న నాలుగేళ్లలో రాప్తాడు మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు మండలం హంపాపురం గ్రామంలో సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామానికి



వచ్చిన ఎమ్మెల్యే సునీతకు స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. పూల బొకేలు, పూలహారాలను తీసుకురావద్దని ఇప్పటికే ఎమ్మెల్యే కార్యాలయం విజ్ఞప్తి చేయగా.. గ్రామస్థులు వాటి స్థానంలో పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నోట్ బుక్స్, పెన్నులు తీసుకొచ్చారు. వాటిని ఎమ్మెల్యే సునీతకు అందజేయగా స్థానిక పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో వ్యవసాయశాఖ ద్వారా అన్నదాత రైతు సేవా సంఘం వారికి 8లక్షల సబ్సిడీతో డ్రోన్ ను అందజేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు. డ్రోన్ ద్వారా పొలాలకు మందుల పిచికారి చేసే విధానాన్ని ఎమ్మెల్యే సమక్షంలో రైతులకు వివరించారు. అనంతరం 50లక్షలఎన్ఆర్ఈజీఎస్, మండల, పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఆమె గ్రామంలో ఇంటింటికీ వెళ్తూ ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఏడాది కాలంలో ఒక్కో ఇంట్లో ఎంత లబ్ధి జరిగిందన్నది వివరించారు. ఈ ఒక్క గ్రామంలో గతంలో 1 కోటి నిధులతో బీసీ హాస్టల్ భవనం, 1.50కోట్లతో సీసీ రోడ్లు, ఈ సంవత్సరం 9 లక్షల 20 వేలతో గోకులం షెడ్లు, 28 మందికి 26 లక్షలు 36 వేలతో డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందజేసినట్టు చెప్పారు. డ్వాక్రా మహిళా సంఘాలకు 11 కోట్లు 45 లక్షలు రుణాలు ఇచ్చామన్నారు. రాప్తాడు మండలంలో 12కోట్లతో రోడ్ల నిర్మాణాలు, 6,163 మందికి సంవత్సరానికి 35 కోట్ల 47లక్షలు పింఛన్ల రూపంలో అందజేసినట్టు చెప్పారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద 33 మందికి 24లక్షలు, 6,696 గృహాలకు కొళాయి కనెక్షన్లకు 1 కోట్ల 22 లక్షలు కేటాయించినట్టు చెప్పారు. తల్లికి వందనం 5,017 మందికి 6 కోట్ల 52 లక్షలు అందిందన్నారు. 12,539 రేషన్ కార్డులు, 4 కోట్ల 52 లక్షలు ఉపాధి హామీ నిధులు ఇచ్చారన్నారు. డ్వాక్రా మహిళా సంఘాలకు 27 కోట్ల 35 లక్షలు ఇచ్చారన్నారు. 6కోట్లతో కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాలు చేపట్టినట్టు చెప్పారు. ఏడాది కాలంలోనే ఇన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని.. రానున్న నాలుగేళ్లలో ఇంకా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చూస్తారన్నారు. ముఖ్యంగా రాప్తాడులో ఇప్పటికే జాకీ పరిశ్రమను వైసీపీ నాయకులు కమీషన్ల కోసం వెళ్లగొట్టారన్నారు. అందుకే ఆ పరిశ్రమ స్థానంలో రేమాండ్స్ పరిశ్రమను తీసుకొచ్చామన్నారు. ఇలాంటి పరిశ్రమలు మరిన్ని తీసుకొస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు. అనంతరం గ్రామస్తులు గ్రామంలో నుంచి చిగిచెర్ల – ధర్మవరం లింక్ వరకు ఉన్న మట్టి రోడ్డు స్థానంలో తారు రోడ్డు వేయించమని విజ్ఞప్తి చేయగా త్వరలోనే తారు రోడ్డు వేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది...

## పుట్టపర్తి నియోజకవర్గం ఏ. పి జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక

### ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ నియోజకవర్గం అధ్యక్షునిగా చాపిరెడ్డి హరి ప్రసాద్



పుట్టపర్తి , :ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక ఎంపిక చేసినట్లు అనంతపురం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కేసాని రామక్రిష్ణ తెలిపారు . మంగళవారం పుట్టపర్తి జిల్లా కేంద్రంలో విలేకరులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక లో భాగంగా పుట్టపర్తి నియోజకవర్గం అధ్యక్షునిగా చాపిరెడ్డి హరి ప్రసాద్ (ఆంధ్ర జ్యోతి ) ని నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు కేసాని రామక్రిష్ణ తెలిపారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్ట్ లు నిత్యం వార్త సేకరణ లో భాగంగా విరామం లేకుండా ఎల్లప్పుడూ బిజి ఉంటూ ఒత్తిడికి గురవుతుంటారు...ఇందుకోసం అప్పుడప్పుడు జర్నలిస్ట్ లకు క్రీడలు నిర్వహించేందుకు ఈ ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ జర్నలిస్ట్ యూనియన్లు అతీతంగా కేవలం ఆటవిడపు కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ అసోసియేషన్ లో ప్రతి ఒక్క జర్నలిస్ట్ కొనసాగవచ్చు అన్నారు. అనంతరం చాపిరెడ్డి హరి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ జర్నలిస్ట్ యూనియన్ ముఖ్య ఉద్దేశ్యం జర్నలిస్టు లకు క్రీడా పోటీల ద్వారా జర్నలిస్ట్ లు మానసికం ఉల్లాసం తో పాటు శారీరిక దృఢత్వం తో ఆరోగ్యకరమైన జీవితానికి దోహదం పడుతున్నారు. అంతేకాకుండా అధికారులతో రాజకీయ నాయకులతో కలసి క్రీడల్లో పాల్గొన్నడం ద్వారా అందరితో పరిచయాలు ఏర్పడుతాయన్నారు. అదే విధంగా రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటే రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్ట్ లు స్నేహ భావంగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. ఈ ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ జర్నలిస్ట్ యూనియన్ ద్వారా వాలీబాల్, షటిల్, క్రికెట్ లాంటి ఆటలు పోటీలు నిర్వహించ తలపెట్టామన్నారు. ఏ. పి జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్షునిగా చాపిరెడ్డి హరి ప్రసాద్ గౌరవ అధ్యక్షులుగా సి. వి. ఆర్ సూరి ఉపాధ్యక్షులు షేక్షావలి ప్రధాన కార్యదర్శి ఎస్. కేశవయ్య ప్రచార కార్యదర్శిగా నూర్ భాషా కోశాధికారిగా ఎన్. ఎన్ నరసింహులు కార్యవర్గ సభ్యులు ఏ. రాజు , రామాంజినేయులు , ,గూడ శ్రీనివాసులు , గంగాధర్, అంజి లు ఎంపిక అయ్యారు .

## పంచాయతీలో పెద్దల ఏకపక్ష తీర్పుతో యువకుడి బలి ...



వరంగల్, :పంచాయతీ పెద్దల తీర్పు నచ్చక యువకుడి ఆత్మహత్య కలకలం సృష్టించింది. పంచాయతీ పెద్దలను సంతోష పెడితే తీర్పు వారి దిక్కే అవుతుంది. ఒకప్పుడు పెద్దరికం అంటే చాలా మర్యాదగా, గొప్పగా, హుందాగా ఉండగా నిజమైన నిజాయితీతో తీర్పు చెప్పేవారిలా ఉండేది. సరైన న్యాయం ఇరుపక్షాలకు చూసి పెద్దలు తీర్పు చెప్పేవారు. కానీ నేటి యుగంలో పెద్దలు ఎవరికి తైలాలు అందిస్తారో వారికి తీర్పు మొగ్గుతుంది. దానితో సదరు న్యాయం ఉన్నా బాధితుడికి అన్యాయమే జరుగుతుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇలాంటి సంఘటననే వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం రోళ్ళకల్లు గ్రామంలో నాల%శీ% మూర్తి (24)కి పొరుగువారైన సమ్మయ్య, రాజు లతో కొన్నేళ్లుగా వారి మధ్య భూమి వాదం చోటుచేసుకుంది. ఈ వివాదాన్ని తీర్చడానికిగాను పంచాయతీ పెద్దలుగా మంగ్య, రాములు వెళ్లారు. వీరు పంచాయతీ పెద్దలుగా కాకుండా వారు ఏకపక్ష తీర్పు చెప్పడంతో నాల%శీ% మూర్తి తీర్పు నచ్చక మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో పంచాయితీ చేయడానికి వెళ్ళిన పెద్ద మనుషులపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వారు పోలీసులను సంప్రదించి పొందవచ్చు - జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ...



కామారెడ్డి, :కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నాడు స్పెషల్ డ్రైవ్ ద్వారా 150 పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీ జరిగింది, బాధితులు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి పోగొట్టుకున్న మొబైల్ పొందవచ్చునని జిల్లా యస్పి యం.రాజేష్ చంద్ర వెల్లడించారు. సెల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని సిఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 150 మొబైల్ ఫోన్లను అంటే సుమారుగా 25 లక్షల రూపాయల విలువగల ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. మొబైల్ పోయినా లేదా చోరీకి గురైన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్ కు వెళ్ళి దరఖాస్తు చేయాలన్నారు మరియు సిమ్ కార్డ్ బ్లాక్ చేసి అదే నంబరు గల కొత్త సిమ్ తీసుకోవాలన్నారు. తద్వారా పోయిన మొబైల్ ఫోన్ల ఐఎంఈఐ వివరాలు సిఈఐఆర్ వెబ్సైట్ లో బ్లాక్ చేయడం వలన పోగొట్టుకున్న మొబైల్ సులబంగా దొరికే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయ%శీ%లో పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఒక ఆర్ఎస్ఐ, 12 మంది కానిస్టేబుల్స్ తో ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరగిందని తెలిపారు. గత (7) రోజులలో ఈ టీం అధికారులు 150 ఫోన్ లను రికవరీ చేయడం మరియు ఇప్పటి వరకు ఈ టీం అధికారులు 627 ఫోన్ లను రికవరీ చేయడం జరిగింది. సీఈఐఆర్ పోర్టల్ ప్రారంభం నుండి ఇప్పటి వరకు 3,551 ఫోన్ లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామన్నారు. ఈ సందర్భంగా 150 మొబైల్ ఫోన్ల రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన టీం సబ్యులు అందరినీ జిల్లా ఎస్పీ అభినందించారు. ఇప్పటి వరకు రికవరీ చేసిన ఫోన్ల వివరాలను బాధితులకు తెలియజేశారు. వారు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఆర్ఎస్ఐ బాలరాజ్ ని సంప్రదించి (8712686114) ఫోన్ కు సంభంధించిన వివరాలు చూపించి తీసుకోవాలన్నారు.

## మటన్ తిని ఒకరి మృతి, ఏడుగురు పరిస్థితి విషమం...



హైదరాబాద్, : హైదరాబాద్ నగరంలోని వనస్థలిపురంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బోనాల సందర్భంగా ఫ్రిజ్లో నిల్వ చేసిన మటన్ తిని ఒకే కుటుంబానికి చెందిన 8 మంది తీవ్ర అస్వస్థకు గురయ్యారు. వారిలో ఆర్టీసీ కండక్టర్ శ్రీనివాస్ చికిత్స పొందుతూ మరణించారు స్థానిక ఆర్టీసీ కాలనీకి చెందిన కుటుంబం ఆదివారం నాడు బోనాల సందర్భంగా మటన్ వండుకుని తిన్నారు. ఎక్కువ మిగిలిన దాన్ని ఫ్రిజ్లో దాచుకుని పెట్టారు. దాన్ని ఈ రోజు తీసుకుని వండుకొని తినడంతో ఫుడ్ పాయిజన్ అయి 8 మంది పరిస్థితి విషమంగా మారింది. మిగతా ఏడుగురు చికిత్స పొందుతున్నారు. వారు కూడా తీవ్ర అస్వస్థతలో ఉన్నట్లు ఆస్పత్రి వర్గాల వెల్లడి.

# అంకురాలకు ఆరు సూత్రాలు

స్టార్టప్‌ల సామర్థ్యాన్ని పెంచేందుకు కొన్ని రాష్ట్రాలు అనుసరిస్తున్న మేలైన పద్ధతులను నీతి ఆయోగ్ ఇటీవలి నివేదికలో పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న టీజీ-ఐపాస్ విధానాన్ని ప్రత్యేకంగా పేర్కొంది. స్టార్టప్‌ల ప్రారంభానికి అవసరమైన హామీలు, అనుమతులు 15 రోజుల్లో అందించడంతోపాటు అనవసర ఆలస్యాన్ని నివారించేందుకు ఈ విధానం వీలు కల్పిస్తోంది. ఇలాంటి అండదండలు అన్నిచోట్లా అందితేనే స్టార్టప్‌ల ప్రగతి సాధ్యపడుతుంది. భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు నీతి ఆయోగ్ మే నెలలో రెండు సమగ్ర నివేదికలు విడుదల చేసింది. మొదటి నివేదిక స్టార్టప్‌ల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకునేందుకు కావాల్సిన వ్యూహాత్మక ప్రణాళికను విపులీకరించింది. రెండోది స్టార్టప్‌ల విధానాలు నిర్లక్ష్యం చేసిన మధ్యమ స్థాయి వ్యాపార సంస్థల అభివృద్ధికి ఆరు సూచనలు చేసింది. 'మధ్యమ స్థాయి వాణిజ్య సంస్థల కోసం విధాన రూపకల్పన' శీర్షికతో రూపొందించిన నీతి ఆయోగ్ నివేదిక స్టార్టప్‌లలో నెలకొన్న అసమతౌల్యాన్ని బహిర్గతం చేసింది. దేశంలోని స్టార్టప్‌లలో 97శాతం సూక్ష్మ సంస్థలు కాగా, 2.7 శాతం చిన్న, 0.3శాతం మధ్యమ స్థాయికి చెందినవి. అంకుర ఎగుమతుల్లో 40శాతం మధ్యమ స్థాయి సంస్థలవే. ఉపాధి కల్పనలోనూ వీటిదే పైచేయి. పరిశ్రమ, యంత్ర పరికరాల స్థాపన కోసం రూ.25-125 కోట్లదాకా పెట్టుబడి పెట్టిన సంస్థలను మధ్యమస్థాయి స్టార్టప్‌లుగా వర్గీకరించారు. ఇవి ఒక్కొక్కటి రూ.100-500 కోట్లదాకా టర్నోవర్ కలిగి ఉన్నాయి.

కీలకం... ప్రగతి వ్యూహం!

స్టార్టప్‌ల కోసం కేంద్రం 18 పథకాలను ప్రవేశపెట్టగా, ఎనిమిది మాత్రమే మధ్యమస్థాయి సంస్థలకు వర్తిస్తున్నాయి. అంకుర రంగానికి మొత్తం రూ.5,442 కోట్లు కేటాయించగా, వాటిలో 17.81 శాతం నిధులే మధ్యమస్థాయి సంస్థలకు అందుబాటులో ఉన్నాయి. ప్రాధాన్య రంగాల్లో పని చేస్తున్న మధ్యమస్థాయి సంస్థలకు సూక్ష్మ స్టార్టప్‌లకన్నా తక్కువ రుణాలు లభిస్తున్నాయి. వీటికి అందిస్తున్న వడ్డీరేటు భారీ సంస్థలకు ఇస్తున్న రుణాల వడ్డీరేటుకన్నా నాలుగు శాతం అధికం. మధ్యమ స్థాయి స్టార్టప్‌లు రుణాలు పొందడంలోనూ పలు సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. ఇవి వాటి అభివృద్ధి, సామర్థ్య పెంపుదలకు ఆటంకంగా మారుతున్నాయి.

# మీ కారు మైలేజీ ఇవ్వడం లేదా? ఈ ట్రిక్‌తో పది నిమిషాల్లోనే మైలేజీ పెంచుకోవచ్చు!

మీరు క్రమం తప్పకుండా ఎక్కువ దూరం డ్రైవ్ చేస్తుంటే లేదా దుమ్ము ఉన్న ప్రాంతాల్లో డ్రైవ్ చేస్తుంటే, ప్రతి 3-4 నెలలకు ఒకసారి రేడియేటర్, కండెన్సర్‌ను శుభ్రం చేయండి. అయితే, సాధారణ ఉపయోగంలో ప్రతి 6 నెలలకు ఒకసారి శుభ్రం చేయడం సరిపోతుంది..మీ కారు మైలేజ్ తగ్గుతుంటే లేదా ఎయిర్ కండిషనింగ్ సిస్టమ్ సరిగ్గా పనిచేయకపోతే దీనికి ప్రధాన కారణం మురికి రేడియేటర్, కండెన్సర్ కావచ్చు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ రెండు భాగాలను క్రమం తప్పకుండా శుభ్రపరచడం వల్ల ఇంధన వినియోగాన్ని 20 శాతం తగ్గించడమే కాకుండా, వాహనం పనితీరును కూడా మెరుగుపరుస్తుందంటున్నారు.రేడియేటర్, కండెన్సర్ శుభ్రం చేయడం ఎందుకు ముఖ్యం?రేడియేటర్, కండెన్సర్ వాహనం థర్మల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ఒక ముఖ్యమైన భాగం. అవి మురికిగా మారితే ఇంజిన్, %ూాజ% సిస్టమ్‌పై అనవసరమైన ఒత్తిడి పడుతుంది. ఇంధన వినియోగం పెరుగుతుంది.ఇంజిన్ నుండి వెలువడే అదనపు వేడిని వెదజల్లడానికి రేడియేటర్ పనిచేస్తుంది. రేడియేటర్‌పై దుమ్ము, ధూళి లేదా కీటకాలు పేరుకుపోతే అది వేడిని సమర్థవంతంగా వెదజల్లదు. ఫలితంగా ఇంజిన్ వేడెక్కడం ప్రారంభమవుతుంది. ఎక్కువ ఇంధనాన్ని వినియోగిస్తుంది.అదే సమయంలో కండెన్సర్ ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలో ప్రధాన భాగం. ఇది వేడి వాయువును చల్లబరుస్తుంది. దానిని ద్రవంగా మారుస్తుంది. ధూళి కారణంగా కండెన్సర్ ఉష్ణ మార్పిడి సామర్థ్యం తగ్గుతుంది. దీని కారణంగా %ూాజ% తక్కువ కూలింగ్‌ను ఇస్తుంది. ఇంజిన్ మరింత కష్టపడి పనిచేయవలసి ఉంటుంది.ఇంట్లో ఎలా శుభ్రం చేయాలి?ఈ సమస్యలను ఎదుర్కోవడానికి, మీరు ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం లేకుండా కూడా ఇంట్లోనే రేడియేటర్, కండెన్సర్‌ను శుభ్రం చేయవచ్చు.ఫ్రంట్ గ్రిల్‌ను శుభ్రపరచడం:రేడియేటర్, కండెన్సర్ వాహనం ముందు బంపర్ వెనుక అమర్చబడి ఉంటాయి.సాధారణ వాటర్ జెట్ లేదా పైపు ఉపయోగించి గ్రిల్ లోపల నీటిని పోయాలి.ఎక్కువ నీటి ప్రెజర్‌ను పెంచవచ్చు. (సన్నని మెటల్ స్ట్రిప్స్) వంగిపోవచ్చు.2-3 నిమిషాలు నీరు పోయడం ద్వారా పేరుకుపోయిన దుమ్ము, ధూళి బయటకు వస్తాయి.గ్రిల్ తెరిచి లోపలి భాగాన్ని శుభ్రం చేయడం:మురికి ఎక్కువగా పేరుకుపోయి ఉంటే, ముందు గ్రిల్‌ను తీసివేసి రేడియేటర్, కండెన్సర్‌ను నేరుగా శుభ్రం చేయండి.గ్రిల్ మీద 3-4 క్లిప్‌లు ఉన్నాయి. వాటిని తీసివేయడం ద్వారా మీరు దానిని సులభంగా తెరవవచ్చు.ఇప్పుడు రెండు భాగాలను మృదువైన బ్రష్ లేదా




తక్కువ పీడన నీటితో పూర్తిగా శుభ్రం చేయండి.రెక్కలు సున్నితంగా ఉంటాయి. అందుకే వాటికి నష్టం జరగకుండా జాగ్రత్త వహించండి.శుభ్రపరిచిన తర్వాత ప్రయోజనాలు ఏమిటి?మైలేజ్ పెరుగుదల: ఇంజిన్ సరిగ్గా చల్లబడుతుంది. ఇది దాని సామర్థ్యాన్ని పెంచుతుంది. ఇంధనాన్ని ఆదా చేస్తుంది.మెరుగైన %ూాజ% పనితీరు: కండెన్సర్‌ను శుభ్రపరచడం వల్ల ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థ కూలింగ్ సామర్థ్యం పెరుగుతుంది.ఇంజిన్ జీవితకాలం పెరుగుతుంది: ఇది వేడెక్కడాన్ని నివారిస్తుంది. ఇది ఇంజిన్ ఎక్కువసేపు ఉండేలా చేస్తుంది.ఎంత తరచుగా శుభ్రం చేయాలి?మీరు క్రమం తప్పకుండా ఎక్కువ దూరం డ్రైవ్ చేస్తుంటే లేదా దుమ్ము ఉన్న ప్రాంతాల్లో డ్రైవ్ చేస్తుంటే, ప్రతి 3-4 నెలలకు ఒకసారి రేడియేటర్, కండెన్సర్‌ను శుభ్రం చేయండి. అయితే, సాధారణ ఉపయోగంలో ప్రతి 6 నెలలకు ఒకసారి శుభ్రం చేయడం సరిపోతుంది.

# అధిక బరువు తగ్గించుకోవడానికి
# బాబా రామ్‌దేవ్ సూచనలు! అద్భుతమైన పతంజలి ఔషధాలు..

బాబా రామదేవ్ బరువు తగ్గడం సమస్యకు ఆయుర్వేద పరిష్కారాలను సూచిస్తున్నారు. అశ్వగంధ, శతవరి వంటి మూలికలు, అరటి, మామిడి, ఖర్జూరం వంటి పండ్లు, పాల వినియోగం, యోగాసనాలు (మండూకాసనం, వక్రాసనం, పవనముక్తాసనం మొదలైనవి) బరువు పెరగడానికి సహాయపడతాయి. మరిన్ని సూచనలు ఇలా ఉన్నాయి..ఆయుర్వేదం వేద కాలం నుండి భారతదేశంలో ఉంది. ప్రజలు ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి మూలికలను ఉపయోగించేవారు. కాలక్రమేణా, ప్రజలు ఆంగ్ల మందులపై ఆధారపడటం ప్రారంభించారు, కానీ ఆయుర్వేదానికి పూర్వ వైభవం తేవడంలో పతంజలి ఒక మైలురాయిగా నిలిచింది. దాని ఉత్పత్తులు దేశవ్యాప్తంగా ఆధారణ పొందాయి. ఆయుర్వేద ఔషధాల నుండి ఆహార పదార్థాల వరకు ప్రజలు పతంజలి ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. దీని వ్యవస్థాపకుడు బాబా రామ్‌దేవ్ కూడా ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి చిట్కాలను ఇస్తూనే ఉన్నారు.నేటి కాలంలో ఊబకాయం చాలా ఆందోళన కలిగించే సమస్య, ఎందుకంటే సరైన ఆహారపు అలవాట్ల కారణంగా బరువు వేగంగా పెరుగుతుంది. ప్రజలు దానిపై శ్రద్ధ చూపనప్పుడు, అది ఊబకాయంగా మారి మిమ్మల్ని అనేక వ్యాధుల బాధితుడిని చేస్తుంది. అదేవిధంగా తక్కువ బరువు కూడా ఆరోగ్యానికి హానికరం. మీ ఎత్తు, వయస్సు, లింగం ప్రకారం ఆరోగ్యకరమైన బరువును కలిగి ఉండటం చాలా ముఖ్యం.మీరు చాలా సన్నగా ఉన్నారు. మీ బరువు ఎటువంటి కారణం లేకుండా తగ్గుతోంది. మీకు ఏమీ తినాలని లేదా త్రాగాలని అనిపించడం లేదు లేదా మీ బరువు అదుపులో లేదు. మీరు దీని గురించి ఆందోళన చెందుతున్నారు, అప్పుడు మీరు బాబా రామ్‌దేవ్ చెప్పిన పద్ధతిని ప్రయత్నించవచ్చు. ఈ వ్యాసంలో, దీని గురించి మనం వివరంగా తెలుసుకుందాం..బరువు తక్కువగా ఉంటే ఏమి చేయాలి?ఒక మహిళ బరువు 28 కిలోలకు తగ్గిపోయిందని బాబా రాందేవ్ అన్నారు. దీని కారణంగా ఆమె రోజువారీ ఇంటి పనులు కూడా చేయలేకపోయింది. దీని తర్వాత ఆమె బరువు 28 నుండి 38 కిలోలకు పెరిగింది. బరువు పెరగాలంటే మందులు తీసుకోకండి, అశ్వగంధ, శతవర్, అరటిపండు, మామిడి, ఖర్జూరం, పాలు మొదలైనవి తీసుకోండి అని బాబా రాందేవ్ చెబుతున్నారు. దీనితో పాటు యోగా చేయాలి. దీనితో మీరు ఆరోగ్యకరమైన బరువును పొందవచ్చు.బరువు తగ్గడానికి యోగాసనాలుబాబా రామ్‌దేవ్ బరువు తగ్గడానికి యోగాసనాలను సూచించారు. వీటిని మీ దినచర్యలో అనుసరించవచ్చు. ఇది బొడ్డు కొవ్వును కూడా తగ్గిస్తుంది.



ఈ ఆసనాలన్నీ మధుమేహంతో బాధపడేవారికి కూడా ప్రయోజనకరంగా ఉంటాయి. మొదటి ఆసనం మండూకాసనం, దీనిలో మీరు వజ్రాసనంలో కూర్చుని మీ చేతులను మీ కడుపుపై ఉంచి ముందుకు వంగి ఉండాలి. దీనితో పాటు, మీరు వక్రాసనం చేయవచ్చు. పవణ్‌ముక్తసనం కూడా సులభమైన కానీ ప్రభావవంతమైన యోగాసనం. ఇది మీ జీర్ణక్రియకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. బరువు తగ్గడానికి ఈ యోగా భంగిమ సిరీస్‌లో ఉత్తానపాద ఆసనం, సర్వాంగసనం, హలాసనం, చక్కిచల్నాసనం, అర్ధన్వాసనం, శలభాసనం కూడా చేయాలని బాబా రామ్‌దేవ్ సూచించారు.ఊబకాయం వల్ల కలిగే సమస్యలుబరువు పెరిగితే, అది డయాబెటిస్‌తో సహా అనేక ఆరోగ్య సమస్యల అవకాశాలను పెంచుతుంది. బరువు పెరుగుతుంటే, మొదట మీరు మీ జీవనశైలిని మెరుగుపరచుకోవాలి. ఇందులో ఆహారాన్ని సమతుల్యం చేసుకోవడం మరియు రోజువారీ దినచర్యలో యోగా లేదా వ్యాయామం చేయడం వంటివి ఉంటాయి, అయితే ఇది ఉన్నప్పటికీ, బరువు పెరుగుతూనే ఉంటే, నిపుణుడిని సంప్రదించడం అవసరం.

# రైతన్నలకు అలర్ట్.. పీఎం కిసాన్ నగదు జమకు ముందు బిగ్ అప్డేట్..

దేశంలో వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేందుకు, అన్నదాతలకు సాయం చేసేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పలు పథకాలను ప్రారంభించిన విషయం తెలిసిందే.. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు భారత ప్రభుత్వం.. 2019 ఫిబ్రవరిలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్ ) పథకాన్ని ప్రారంభించింది.. దీనిలో భాగంగా ఏడాదికి రూ.6,000 చొప్పున రైతులకు ప్రభుత్వం అందిస్తోంది.దేశంలో వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేందుకు, అన్నదాతలకు సాయం చేసేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పలు పథకాలను ప్రారంభించిన విషయం తెలిసిందే.. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు భారత ప్రభుత్వం.. 2019 ఫిబ్రవరిలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్ ) పథకాన్ని ప్రారంభించింది.. దీనిలో భాగంగా ఏడాదికి రూ.6,000 చొప్పున రైతులకు ప్రభుత్వం అందిస్తోంది. ఈ ఆరు వేల మొత్తాన్ని ప్రభుత్వం మూడు వాయిదాలలో రూ.2,000 చొప్పున రైతుల ఖాతాలో జమ చేస్తోంది. అయితే, ఇటీవలే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన 19వ విడత నిధులను కేంద్రం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు 20వ విడత పీఎం కిసాన్ నగదు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో పీఎం కిసాన్ 20వ వాయిదా కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారుల కోసం కేంద్రం అలర్ట్ జారీ చేసింది.ప్రధానమంత్రి కిసాన్ పథకం 20వ విడత విడుదలకు ముందు, వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ పథకం లబ్ధిదారులకు ఒక ప్రజా సలహాను జారీ చేసింది. పిఎం కిసాన్‌కు సంబంధించిన తప్పుడు సమాచారం పట్ల లబ్ధిదారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రిత్వ శాఖ కోరింది. వ్యవసాయం %-% రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధీనంలోని %ూవీఖ×ూాచీ% పథకం అధికారిక ట్విట్టర్ ఖాతా పలు సూచనలు చేస్తూ కీలక ట్వీట్ చేసింది.. "రైతు సోదరసోదరీమణులారా, %ూవీ-ఖ×ూాచీ% పేరుతో సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారం పట్ల జాగ్రత్త వహించండి. లను మాత్రమే విశ్వసించండి. నకిలీ లింక్‌లు, కాల్‌లు, సందేశాలకు దూరంగా ఉండండి." అంటూ అలర్ట్ జారీ చేసింది.ఇప్పటికే.. %ూవీ-ఖఱయిఅ% పథకం 20వ విడత కోసం లక్షలాది మంది రైతులు ఎదురుచూస్తున్నారు. దీని కింద వారి బ్యాంకు ఖాతాలో రూ. 2,000 జమ అవుతుంది. ఈ నిధుల విడుదలకు సంబంధించి ఇంకా అధికారిక సమాచారం ఇవ్వలేదు.ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ప్రయోజనాలను పొందడానికి, రైతులు ఈ 5 ప్రధాన విషయాలను గుర్తుంచుకోవాలి.మీ బ్యాంక్ ఖాతాను ఆధార్ కార్డుతో లింక్ చేయండిమీ ఆధార్ సీడింగ్‌ను బ్యాంక్ ఖాతా స్థితితో తనిఖీ చేయండిమీ ఆధార్ సీడెడ్ బ్యాంక్ ఖాతాలో మీ



%ణదీ% ఎంపికను యాక్టివ్‌గా ఉంచండిమీ %వ-ఖ్జ%ని పూర్తి చేయండికిసాన్ పోర్టల్‌లోని 'నో యువర్ స్టేటస్' మాడ్యూల్ కింద మీ ఆధార్ సీడింగ్ స్థితిని తనిఖీ చేయండి.ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడత: లబ్ధిదారుల జాబితాలో మీ పేరును ఎలా తనిఖీ చేయాలి?అధికారిక కిసాన్ వెబ్‌సైట్ పోర్టల్‌ను సందర్శించండి.. దీనిలో రాష్ట్రం, జిల్లా, ఉప జిల్లా %-% పంచాయతీని ఎంచుకోండి.. ఆ తర్వాత షో బటన్ పై క్లిక్ చేయండి.. దీని తర్వాత మీరు మీ వివరాలను ఎంచుకోవచ్చు.. 'రిపోర్ట్ పొందండి' బటన్ క్లిక్ చేయడం ద్వారా.. మీ పేరును లబ్ధిదారుల జాబితాలో చూడవచ్చుఫిబ్రవరిలో 19వ విడత విడుదలఈ ఏడాది ఫిబ్రవరిలో భిహార్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యొక్క 19వ విడతను ప్రధాన మంత్రి మోదీ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 2.41 కోట్ల మంది మహిళా రైతులతో సహా 9.8 కోట్ల మంది రైతులకు పథకం 19వ విడత వాయిదా బదిలీ చేయబడింది.. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా రూ.22,000 కోట్లకు పైగా ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందింది.

## ఇక కొనడం కష్టమే గురూ..!
# భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు.. తులంపై ఏకంగా..

బంగారం ధరలు ఆకాశన్నంటుతున్నాయి..

గతంలో ఎన్నడూ లేని విధంగా నాన్‌స్టాప్‌గా పరుగులు పెడుతూ.. పసిడి ధరలు ఆల్‌టైం హైకి చేరిన విషయం తెలిసిందే.. ఇటీవల భారీగా పెరిగిన పసిడి ధర.. తగ్గినట్లే తగ్గి మళ్లీ లక్ష మార్క్ దాటింది..బంగారం ధరలు ఆకాశన్నంటుతున్నాయి.. గతంలో ఎన్నడూ లేని విధంగా నాన్‌స్టాప్‌గా పరుగులు పెడుతూ.. పసిడి ధరలు ఆల్‌టైం హైకి చేరిన విషయం తెలిసిందే.. ఇటీవల భారీగా పెరిగిన పసిడి ధర.. తగ్గినట్లే తగ్గి మళ్లీ లక్ష మార్క్ దాటింది.. అటు వెండి కూడా ఎన్నడూ లేని విధంగా పరుగులు పెడుతుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.. తాజాగా.. బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి.. స్వచ్ఛమైన పసిడి 10 గ్రాములపై తాజాగా 1100 పెరగగా.. వెండి కిలోపై ఏకంగా రూ. 2వేలు పెరిగింది. వాస్తవానికి బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కోసారి పెరిగితే.. మరికొన్ని సార్లు తగ్గుతూ వస్తుంటాయి.. అయితే.. ఇటీవలే బంగారం, వెండి ధరలు ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఆ తర్వాత స్వల్పంగా తగ్గినప్పటికీ.. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో మళ్లీ పెరుగుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు.జులై 22 2025 మంగళవారం పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. దేశియంగా బంగారం, వెండి రేట్లు ఇలా ఉన్నాయి.24 క్యారెట్ల బంగారం పది గ్రాములపై రూ.1140 పెరిగి.. రూ.1,01,290గా ఉంది.22 క్యారెట్ల పసిడి పది గ్రాములపై రూ.1050 ధర పెరిగి.. రూ.92,850 లుగా ఉంది.వెండి ధర కిలోపై రూ.2వేలు పెరిగి రూ.1,18,000 లుగా ఉంది.అయితే, ప్రాంతాల వారిగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది.తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం పదిగ్రాముల ధర రూ.1,01,290 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.92,850 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,28,000 గా ఉంది.విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,00,040, 22 క్యారెట్ల ధర రూ.91,700 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,28,000 లుగా ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,440, 22 క్యారెట్ల ధర రూ.93,000 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,18,000 లుగా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,290, 22 క్యారెట్ల ధర రూ.92,850 ఉంది. వెండి ధర కిలో రూ.1,18,000 గా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,01,290 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.92,850 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,28,000 లుగా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,01,290, 22 క్యారెట్ల ధర రూ.92,850 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,18,000 లుగా ఉంది. గమనిక, బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.మరిన్ని బిజినెస్ వార్తల కోసం ఇక్కడ క్లిక్ చేయండి..

## రైలు ప్రయాణికులకు బిగ్ రిలీఫ్.. ఆధార్ లేకున్నా తత్కాల్ టికెట్లు!




ఈ కొత్త వ్యవస్థ ప్రస్తుత వ్యవస్థ కంటే 10 రెట్లు వేగంగా ఉంటుంది. ప్రస్తుత వ్యవస్థ నిమిషానికి 32,000 టికెట్ బుకింగ్‌లను నిర్వహించగలదు. కానీ కొత్త వ్యవస్థ నిమిషానికి 1.5 లక్షల టికెట్ బుకింగ్‌లకు మద్దతు ఇస్తుంది. ఇది మాత్రమే..ఇటీవల భారత రైల్వే తత్కాల్ టికెట్ల విషయంలో కొత్త నిబంధనలు ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునే వారు ఐఆర్‌సీటీసీ (%×=ఙజ%) అకౌంట్‌కు ఆధార్ కార్డు లింక్ చేయడం తప్పనిసరి చేసింది. ఆధార్ లింకు చేసుకోకుంటే తత్కాల్ టికెట్లను బుక్ చేసుకునేందుకు వీలుండదు. జూలై 1వ తేదీ నుంచి ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో తత్కాల్ టికెట్లు బుక్ చేసుకోవాలన్నా ఆధార్ అథంటికేషన్ తప్పనిసరి అని ప్రకటించింది రైల్వే. జూలై 15 నుంచి రిజర్వేషన్ కౌంటర్లలోనూ ఆధార్ ఆధారిత ఓటీపీ విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. అయితే ప్రస్తుతం ఆధార్ వివరాలు లేకున్నా రిజర్వేషన్ కౌంటర్లలో తత్కాల్ టికెట్లను జారీ చేస్తున్నారు. మూడు రోజులుగా రిజర్వేషన్ సిబ్బంది ఆధార్ లేకుండానే టికెట్లు జారీ చేస్తున్నారు. ఆధార్ అథంటికేషన్ ప్రక్రియలో ఏర్పడిన టెక్నికల్ సమస్యల కారణంగా కొత్త విధానాన్ని తాత్కాలింగా వాయిదా వేసినట్లు సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సీఆర్ఐఎస్) అధికారులు వెల్లడించారు.ఇది కూడా చదవండి:విద్యార్థులకు శుభవార్త.. జూలై 23న పాఠశాలలు, కాలేజీలు బంద్.. కారణం ఏంటంటే..సాంకేతిక సమస్యలు తలెత్తుతున్న కారణంగా రిజర్వేషన్ కౌంటర్లలో తత్కాల్ టికెట్ల కోసం మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని భావించిన రైల్వే అధికారులు.. ప్రస్తుతానికి ఆధార్ లింక్ విధానాన్ని వాయిదా వేసినట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఒక నిమిషంలో నాలుగు టికెట్లు ఇస్తున్నామని, కొత్త విధానంలో ఆధార్ అథంటికేషన్ ఓటీపీని నమోదు చేయాల్సి వస్తే ప్రతీ టికెట్టు జారీకి కనీసం 52 సెకన్ల చొప్పున సమయం పడుతుందని అంటున్నారు. టికెట్ జారీలో జాప్యాన్ని నివారించడం సాధ్యం కాకపోవడంతో తాత్కాలింగా వాయిదా వేసిందని చెబుతున్నారు.కొత్త రిజర్వేషన్ వ్యవస్థను సిద్ధం:రైల్వేలు తన ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ పూర్తిగా అప్‌గ్రేడ్ చేయబోతున్నాయి. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఈ పనిని నిర్వహిస్తోంది. ఈ కొత్త వ్యవస్థ డిసెంబర్ 2025 నాటికి సిద్ధంగా ఉంటుందని భావిస్తున్నారు.ఈ కొత్త వ్యవస్థ ప్రస్తుత వ్యవస్థ కంటే 10 రెట్లు వేగంగా ఉంటుంది. ప్రస్తుత వ్యవస్థ నిమిషానికి 32,000 టికెట్ బుకింగ్‌లను నిర్వహించగలదు. కానీ కొత్త వ్యవస్థ నిమిషానికి 1.5 లక్షల టికెట్ బుకింగ్‌లకు మద్దతు ఇస్తుంది. ఇది మాత్రమే కాదు, ప్రస్తుత వ్యవస్థ నిమిషానికి 4 లక్షల విచారణలను ప్రాసెస్ చేస్తుంది. కొత్త వ్యవస్థ నిమిషానికి 40 లక్షల విచారణలను నిర్వహిస్తుందని రైల్వే వర్గాల ద్వారా సమాచారం.

## విద్యార్థులకు శుభవార్త..
## జూలై 23న పాఠశాలలు, కాలేజీలు బంద్..




పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లను వెంటనే చెల్లించాలని, దూర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్ పెద్ద సమస్య నెలకొందని, వారికి ఉచిత బస్ పాస్ సౌకర్యం అవసరమని, అలాగే చాలా మంది విద్యార్థులు పేద కుటుంబాలవారని, వారి..తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల వర్షాలు, పండుగలు, విద్యార్థి ఆందోళనల కారణంగా పాఠశాలలు, కాలేజీలకు వరుస సెలవులు వస్తున్నాయి. గత వారం శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజుల సెలవుల తర్వాత, ఇప్పుడు బుధవారం (జూలై 23)న కూడా విద్యాసంస్థలు బంద్ కానున్నాయి. దీంతో విద్యార్థులకు మరో సెలవు లభిస్తుంది. అయితే విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు చేస్తున్న నిరసన కారణంగా పాఠశాలలు మూసివేయనున్నారు.గత వారం శనివారం భారీ వర్షాల కారణంగా పాఠశాలలు మూసివేశారు. ఆదివారం సెలవే. సోమవారం బోనాల పండుగ కారణంగా సెలవు. మంగళవారం తరువాత ఇప్పుడు బుధవారం కూడా సెలవు వస్తుంది. దీంతో విద్యార్థులకు వరుస సెలవులు వస్తున్నాయి.ఇది కూడా చదవండి: వాహనదారులకు గుడ్‌న్యూస్.. వీరికి టోల్ ట్యాక్స్ ఉండదు!విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ పీడీఎస్‌యూ ఏఐవైఎఫ్ (%ూ×ఖీ%) కలిసి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చాయి. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో విద్యాసంస్థలను మూసివేయనున్నట్లు విద్యార్థి సంఘాలు ప్రకటించాయి.ప్రధాన డిమాండ్లు ఏంటి?ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఫీజుల పేరుతో తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, దీనిపై తక్షణమే నియంత్రణ చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఉపాధ్యాయుల కొరతను సైతం తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు లేకపోవడంతో విద్యార్థులకు పాఠాలు చెప్పడం కష్టమవుతోంది. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, పోస్టులు వెంటనే భర్తీ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లను వెంటనే చెల్లించాలని, దూర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్ పెద్ద సమస్య నెలకొందని, వారికి ఉచిత బస్ పాస్ సౌకర్యం అవసరమని, అలాగే చాలా మంది విద్యార్థులు పేద కుటుంబాలవారని, వారి కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కళాశాలల్లో కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యా సంస్థల బంద్ ను విజయవంతం చేయడంలో తల్లిదండ్రులు, మేధావులు, విద్యావేత్తలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఖాతాదారులకు అలర్ట్..
## జూలై 23న బ్యాంకులు
## మూసి ఉంటాయా? లేదా?

యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అంతరాయం లేకుండా 24/7 పనిచేస్తూనే ఉంటాయి. ఈ ఛానెల్‌లు ఏదైనా పండుగ లేదా పబ్లిక్ ఈవెంట్ సమయంలో లావాదేవీలు, యుటిలిటీ చెల్లింపులు, నిధుల బదిలీలకు అనుకూలమైన ఎంపికగా..భారతదేశం జూలై 23 బుధవారం సావన్ శివరాత్రిని జరుపుకోవడానికి సిద్ధమవుతున్నందున కొనసాగుతున్న కన్వర్ యాత్ర కారణంగా ఉత్తరాది రాష్ట్రాలలో అనేక పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేయనున్నారు. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ రోజు బ్యాంకు సెలవు దినంగా పేర్కొనలేదు. అంటే 23న దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులు తెరిచి ఉంటాయి. చాలా మంది బ్యాంకులు మూసి ఉంటాయని భావిస్తున్నారు. దీనికి ఎలాంటి సెలవు ప్రకటించలేదు ఆర్బీఐ.బ్యాంకింగ్ సేవలకు ఎటువంటి అంతరాయం ఉండనప్పటికీ, ముఖ్యంగా మతపరమైన ఊరేగింపుల కారణంగా భారీ ట్రాఫిక్, భద్రతా చర్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాలలో సందర్శనలను తదనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు.ఇది కూడా చదవండి: వాహనదారులకు గుడ్‌న్యూస్.. వీరికి టోల్ ట్యాక్స్ ఉండదు!ఇవి కూడా చదవండి ఇంతలో మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అంతరాయం లేకుండా 24/7 పనిచేస్తూనే ఉంటాయి.

ఈ ఛానెల్‌లు ఏదైనా పండుగ లేదా పబ్లిక్ ఈవెంట్ సమయంలో లావాదేవీలు, యుటిలిటీ చెల్లింపులు, నిధుల బదిలీలకు అనుకూలమైన ఎంపికగా ఉంటాయి. ఆర్బీఐ నెలవారీ బ్యాంకు సెలవుల క్యాలెండర్‌ను విడుదల చేస్తుంది. ఇందులో ప్రాంతీయ ఆచారాలు, ప్రామాణిక వారాంతాలు రెండూ ఉంటాయి. జూలై 2025లో 13 బ్యాంకు సెలవులు వచ్చాయి.

# ఆడవాళ్లకే ఎక్కువగా చలి తీవ్రత



చలి తీవ్రత ఏమాత్రం తగ్గడంలేదు. ఉదయం తొమ్మిది దాటుతున్నా.. గజగజా వణకడం మాత్రం తప్పడంలేదు. అయితే, చలిలో ఆడవాళ్లే ఎక్కువగా వణుకుతుండటం ఎప్పుడైనా గమనించారా? ‘అది నిజమే!’ అని వైద్య నిపుణులు అంటున్నారు. ఎందుకంటే.. పురుషులతో పోలిస్తే, మహిళలే ఎక్కువగా చలి బారినపడతారట. ఇందుకు కారణాలు అనేకం. అందులో మొదటిది.. మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత. నెలసరి కారణంగా శరీరంలో.. ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లలో హెచ్చుతగ్గులు ఏర్పడతాయి. ఇవి, శరీర ఉష్ణోగ్రతను ప్రభావితం చేస్తాయి. అంతేకాకుండా, మహిళల్లో జీవక్రియ రేటు తక్కువగా ఉండటం కూడా మరో కారణం. దీనివల్ల శరీరంలో తక్కువ వేడి ఉత్పత్తి అవుతుంది. ఉష్ణోగ్రత తగ్గడం వల్ల వారికి మరింత చలిగా అనిపిస్తుంది. మహిళల శరీరంలో ఎక్కువ మొత్తంలో పేరుకుపోయే కొవ్వు.. అంతర్గత వేడిని ప్రసరింపజేసే రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. ఫలితంగా, మహిళలు మరింత చలిని అనుభవిస్తారని నిపుణులు చెబుతున్నారు.

# ఇలాంటి ఆహారాలు మీ కిడ్నీలను దెబ్బతీస్తాయి.. వెంటనే వాటికి గుడ్ బై చెప్పండి



కిడ్నీ మన శరీరానికి అవసరమైన అవయవాలలో ఒకటి. ఇది శరీరంలో అనేక ముఖ్యమైన విధులను నిర్వహిస్తుంది. ఆరోగ్యకరమైన మూత్రపిండాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. శరీరంలోని ఈ ముఖ్యమైన భాగాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. అయినప్పటికీ, వేగంగా మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల పట్ల అజాగ్రత్తగా ఉండటం వల్ల కిడ్నీ వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. అటువంటి పరిస్థితిలో మీరు మీ మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే ఈ 5 ఆహారాలకు దూరంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలాంటి అనారోగ్యకర ఆహారాల గురించి తెలుసుకుందాం. మీరు కిడ్నీ సంబంధిత వ్యాధికి గురైనట్లయితే పాల ఉత్పత్తులకు అంటే చీజ్, క్రీమ్, వెన్న వంటి పూర్తి కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. దీంతో కిడ్నీ, గుండె సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. అలాగే, మీరు టమోటాలను ఎక్కువ పరిమాణంలో తీసుకుంటే, అది మూత్రపిండాలకు హానికరం. మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉండటానికి, టమాటాలకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. ప్యాక్డ్ ఫుడ్స్ అన్ని విధాలుగా ఆరోగ్యానికి హానికరం. ఇలాంటి ఆహారాన్ని తాజాగా ఉంచడానికి, అధిక సోడియం ఉపయోగిస్తారు. ఇది రక్తపోటును పెంచుతుంది. మూత్రపిండాలను కూడా ప్రభావితం చేస్తుంది. అలాగే, నారింజ కూడా. ఇందులో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది మూత్రపిండాలకు హానికరం. మీరు మీ ఆహారంలో నారింజను కూడా చేర్చుకుంటే, ఈరోజే దానికి వీడ్కోలు చెప్పండి. మూత్రపిండాల వ్యాధి ఉన్నవారికి రెడ్ మీట్ చాలా హానికరం. దీన్ని తీసుకోవడం వల్ల కిడ్నీకి ఎక్కువ నష్టం వాటిల్లుతుంది.

# బెండకాయలను తింటే ఇన్ని లాభాలు కలుగుతాయా.. తెలిస్తే షాకవుతారు



బెండకాయలు.. వీటినే ఇంగ్లిష్‌లో ఓక్రా అని, లేడీస్ ఫింగర్ అని కూడా పిలుస్తారు. బెండకాయలను మొదటగా ఆఫ్రికాలో పండించారు. అక్కడి నుంచి ఇవి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలకు వ్యాపించాయి. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది బెండకాయలను ఎంతో ఇష్టంగా తింటుంటారు. వీటితో అనేక రకాల వంటకాలను చేస్తుంటారు. బెండకాయలను లేతగా ఉన్నప్పుడే తినాల్సి ఉంటుంది. ముదిరితే రుచి అంత బాగోవు. ఇక బెండకాయలతో మనం వేపుడు, పులుసు వంటివి చేస్తుంటాం. చాలా మంది వీటిని చారు వంటి వాటిలోనూ వేస్తుంటారు. దీంతో ఇవి చక్కని రుచిని కలిగి ఉంటాయి. అయితే బెండకాయలను తరచూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వీటిల్లో విటమిన్లు ఎ, సి సమృద్ధిగా ఉంటాయి. అలాగే పొటాషియం, మెగ్నిషియం కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి.

**హార్ట్ ఎటాక్ రాదు..**

బెండకాయల్లో విటమిన్లు ఎ, సిలతోపాటు మెగ్నిషియం, పొటాషియం, క్యాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి మనల్ని అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ కాయలను తరచూ తినడం వల్ల వీటిల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమయ్యేలా చేస్తుంది. దీంతో మలబద్ధకం తగ్గుతుంది. బెండకాయలను తరచూ తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. జీర్ణవ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇది జీర్ణాశయం, పేగులను ఆరోగ్యంగా ఉంచుతుంది. బెండకాయలను తినడం వల్ల మన శరీరం ఆహారాల్లో ఉండే కొవ్వును శోషించుకోదు. దీంతో శరీరంలో కొలెస్ట్రాల్ చేరకుండా అడ్డుకోవచ్చు. ఫలితంగా రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

**అధిక బరువు తగ్గుతారు..**

బెండకాయల్లో పాలిఫినాల్స్ అనే సమ్మేళనాలు సమృద్ధిగా ఉంటాయి. అలాగే వీటిల్లో ఫైబర్ కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తాయి. దీంతో డయాబెటిస్ అదుపులో ఉంటుంది. మధుమేహం ఉన్నవారికి బెండకాయలు ఒక వరం అనే చెప్పవచ్చు. వీటితో డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. బెండకాయలను తినడం వల్ల విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో రోగాలు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. అధిక బరువు ఉన్నవారు బెండకాయలను తరచూ తింటుంటే బరువును తగ్గించుకోవచ్చు. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయకుండా చేయడంలో బెండకాయలు ఎంతో ఉపయోగపడతాయి. దీంతో అధిక బరువును తగ్గించుకోవచ్చు.

**కంటి చూపు మెరుగు పడుతుంది..**

బెండకాయల్లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది. తరచూ బెండకాయలను తినడం వల్ల కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. వయస్సు మీద పడడం వల్ల వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. వీటిని తింటుంటే శరీరంలోని నొప్పులు, వాపులను తగ్గించుకోవచ్చు. బెండకాయల్లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు శరీరంలోని నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. ఈ కాయల్లో క్యాల్షియం, విటమిన్ సి, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇలా బెండకాయలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# రాజ్యాంగంలో సైన్స్ స్ఫూర్తి



‘ఎవరో చెప్పారని, లేదా సంప్రదాయమని, లేదా నీకు నీవే ఊహించుకొని దేనినీ నమ్మొద్దు! చెప్పిన గురువు మీద గౌరవంతో విన్నదంతా నమ్మొద్దు! నీకు నువ్వే పరీక్షించి, విశ్లేషించుకుని అది మంచిదని, సమాజానికి మేలు చేస్తుందని బోధపడిన తర్వాతే దాన్ని స్వీకరించు, దాన్ని నీ పథంగా అందుకో !’ అని రెండున్నర వేల సంవత్సరాల క్రితం బుద్ధుడు చెప్పాడు. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఎలా పరిగణించి ముందుకెళ్లాలో తెలియజెప్పడానికి ఈ మార్గాన్ని ఆయన సూచించాడు. దీనినే ప్రపంచవ్యాప్తంగా ‘సైంటిఫిక్ టెంపర్’ అనే భావనకు సమగ్రమైన నిర్వచనంగా పరిగణిస్తున్నారు. ‘సైంటిఫిక్ టెంపర్’ అనే మాటను తొలుత వాడింది సిద్ధాంతకర్త కాదు, భాషావేత్త అసలే కాదు. జవహర్‌లాల్ నెహ్రూ 1946లో తన పుస్తకం ‘డిస్కవరీ ఆఫ్ ఇండియా’లో ఈ మాటను మొదటిసారి ఉపయోగించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ భావన మరింత గౌరవనీయమైన స్థానాన్ని ఆక్రమించింది. 1958లో సైన్స్ పాలసీ వచ్చినప్పటి నుంచి ఈ మాటను విరివిగా వాడటంతోపాటు సైన్స్- సమాజం మధ్యనున్న సంబంధ బాంధవ్యాలను బలోపేతం చేయడానికి కృషి పెరిగింది. ‘సైన్స్ టెంపర్’ అనే మాటను తెలుగులో ‘సైన్స్ అభినివేశం’ లేదా ‘శాస్త్రీయ అభినివేశం’ అని అనువాదం చేసుకోవచ్చు. ప్రశ్నించడం, పరిశీలించడం, పరీక్షించడం, ప్రతిపాదించడం, విశ్లేషించడం, సమాజానికి అనువర్తింప చేయడం, ఫలితాలను జాగ్రత్తగా పరిశీలించడం వంటివి ఈ కోవలోకి వస్తాయి. ప్రపంచంలో భారతదేశమే తొలిసారి తన రాజ్యాంగంలో ఈ ‘సైంటిఫిక్ టెంపర్’ గురించి పేర్కొన్నది. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నియమాలని విధిగా గౌరవిస్తూ జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించాలని మొదలయ్యే ప్రాథమిక విధులు పౌరులకు ఉంటాయని ఆర్టికల్ 51 (ఏ) హెచ్ చెప్తుంది. ఇందులో ఎనిమిదవది అయిన హెచ్.. ‘%ుశీ ౕవజవశ్రీశీజూ్ౌష్ట్రవ ం౹ఱవత్‌ఱటఱష్ౌవఎజూవతీ, ష్ట్రబఝఱఅఱంఎ ఖఅ౹ ంజూఱతీఱ్‌ శీట ఱఅనబఱతీఎ ఖఅ౹ తీవటశీతీఎ%’ అని వివరిస్తున్నది. ఈ మాటలను జాగ్రత్తగా గమనిస్తే సైంటిఫిక్ టెంపర్‌తో పాటు మానవత, జిజ్ఞాస, సంస్కరణ అనే భావనలు కూడా కనబడతాయి. ఈ నాలుగింటిని కలగలిపి మన దృష్టి పథాన్ని రూపొందించుకోవాల్సింది ఉంటుంది. 1976లో 42వ రాజ్యాంగ సవరణ చేసినప్పుడు ఈ ‘హెచ్’ అధికరణం వచ్చి అంతర్భాగమైంది. మరి భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాలకు ఎంత ఖర్చు పెడుతున్నదనే సందేహం రాకమానదు. జీడీపీలో 0.66 శాతమే భారతదేశం ఇం దుకు కేటాయించింది. నిజానికి ఒక శాతం చేస్తున్నట్టు రెండు దశాబ్దాలు గా మనం వింటున్నాం, కానీ వాస్తవరూపం ధరించలేదు. తమ తలసరి ఆదాయంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు 3.07, చైనా 2.4, దక్షిణ కొరి యా 4.5 శాతం చొప్పున ఖర్చు పెడుతున్నాయి. కనుకనే, ఆ మేరకు ఫలితాలు వస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మంచి పరిశోధనలు చేయ డం వల్లే పారిశ్రామికంగా ఆ దేశాలు లాభదాయకమైన స్థానంలో ఉండగలుగుతున్నాయి. ఉత్తమమైన మానవ వనరులున్న మన దేశం కనీసం ఒక శాతం ఖర్చు పెట్టగలిగితే అద్భుతమైన ఫలితాలు వస్తాయి.

# పౌరసత్వం కోసం ప్రసవాలు




పుట్టిన దేశాన్ని వీడి అమెరికాలోనే శాశ్వత నివాసం ఏర్పర్చుకున్న వాళ్లు కోకొల్లలు. పౌరసత్వం కోసం శతవిధాలా ప్రయత్నించేవాళ్లు తండోపతండాలు. అది వాళ్ల హక్కు. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే అమెరికా పౌరసత్వం అనివార్యమని భావించే తల్లిదండ్రులున్నారు. ఆ మోజు ఎంతటి విపరీత ధోరణికి దారితీస్తున్నదంటే భావితరాల భవితవ్యాన్ని కూడా అంధకారంలో పడేసేందుకూ అమెరికాలోని భారతీయ పౌరులు వెనుకాడటం లేదు. అమెరికా కొత్త అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అమెరికాలో పుట్టే పిల్లలకు ఆ దేశ పౌరసత్వం వస్తుంది. దీన్ని యూఎస్ బర్త్ రైట్ సిటిజన్‌షిప్ అంటారు. అమెరికాకు వలసవెళ్లిన వారికి అక్కడ పిల్లలు పుడితే వారికి జన్మతః పౌరసత్వం వస్తుంది. 1868లో అమెరికా 14వ సవరణ ద్వారా ఈ హక్కును ఆ దేశ రాజ్యాంగంలో చేర్చారు. ఇప్పుడు ఆ హక్కును రద్దు చేస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమ వలసదారులకు, తాత్కాలిక వీసాపై అమెరికాకు వచ్చిన వారికి స్థానికంగా పిల్లలు పుడితే తమ దేశం పౌరసత్వం ఇచ్చే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. ఈ విధానం ఫిబ్రవరి 20 నుంచి అమల్లోకి రానున్నది. అంటే ఫిబ్రవరి 19 వరకు పుట్టే పిల్లలకు మాత్రమే పుట్టుకతో అమెరికా పౌరసత్వం వస్తుంది. అందుకే ‘అమ్మ’ ఆత్మ ఆతృతపడుతున్నది. 7, 8 నెలల గర్భిణులుగా ఉన్న తల్లులు ముందస్తు ప్రసవాలకు సిద్ధమవుతున్నారు. అమెరికా, భారత జాతీయ మీడియా కథనాల ప్రకారం.. అమెరికాలోని భారతీయ మహిళలు 2 రోజులుగా ప్రసూతి దవాఖానలకు పోటెత్తుతున్నారు. 7 నెలలు నిండని గర్భిణులు కూడా ప్రసవాలకు ప్లాన్ చేస్తున్నట్టు అమెరికాలోని భారతీయ వైద్యులు ఆ కథనాల్లో పేర్కొంటున్నారు. అమెరికాలో హెచ్-1బీ, ఎల్-1 తాత్కాలిక వీసాలపై లక్షల మంది జీవిస్తున్నారు. వీళ్లంతా అమెరికాలో శాశ్వత పౌరసత్వం కోసం ఇచ్చే గ్రీన్‌కార్డు కోసం నిరీక్షిస్తున్నారు. ‘తాము ఆరేండ్లుగా గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నామని, ఇదొక్కటే తమకు స్థిరత్వాన్ని ఇవ్వగలదు’ అని ప్రియా అనే ఓ గర్భిణీ చెప్తున్నది. తమ బిడ్డ అమెరికాలో పుడితే జన్మతః పౌరసత్వం వస్తుందని ఎదురు చూశామని, ట్రంప్ నిర్ణయంతో భయాందోళనకు గురైనట్టు ఆమె తెలిపారు. ‘చాలా త్యాగాలు చేసి అమెరికా వచ్చామని, కానీ, ట్రంప్ నిర్ణయంతో దారులు మూసుకుపోయాయనే భావన కలుగుతున్నది’ అని ఓ తండ్రి చెప్తున్నారు. ‘తమకు పుట్టే బిడ్డ ద్వారా పౌరసత్వం వస్తుందని భావించామని, ఇప్పుడు తమకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది’ అని ఆయన ఆందోళన చెందుతున్నాడు. పిల్లల ద్వారా పౌరసత్వం పొందేందుకు ప్రయత్నిస్తున్న తల్లిదండ్రులు చాలా రిస్క్ చేస్తున్నారు. నెలలు నిండకున్నా ముందస్తు ప్రసవాల కోసం సిద్ధమవుతున్నారు. దీనివల్ల తల్లీ బిడ్డలిద్దరికీ ప్రాణాపాయమని వైద్యులు చెప్తున్నా, పౌరసత్వమే జీవిత పరమావధిగా వారు భావిస్తున్నారని అక్కడి వైద్యుల మాటల్లో స్పష్టమవుతున్నది. అంటే, ఇప్పుడు పౌరసత్వం కోసమే ముందస్తు ప్రసవాలకు మొగ్గు చూపడం వల్ల.. ప్రసవం సమయంలో సమస్యలు గట్టెక్కినా.. ఆ తర్వాత పరిస్థితి ఏమిటి? నెలలు నిండని బిడ్డ జీవితాంతం సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యులు చెప్తున్నారు. ఊపిరితిత్తులు ఎదగకపోవడం, నాడీ వ్యవస్థకు సంబంధించిన సవాళ్లతో బాధపడాల్సి ఉంటుంది. ఉన్న ఊరు కన్నతల్లి వంటిదని మన పెద్దలు ఏనాడో చెప్పారు. బతుకుదెరువు కోసం ఎవరు ఎక్కడికి వెళ్లి జీవించినా తిరిగి రావాల్సింది సొంత గ్రామానికే. అయినా ప్రపంచం కుగ్రామమైన నేపథ్యంలో ఎవరు ఎక్కడ నివసిస్తే ఏమున్నది. అమెరికా పౌరసత్వ మోజులో పడి నిండు గర్భిణుల ప్రాణాలను పణంగా పెట్టడం భావ్యమేనా? భావితరాల బతుకు ను ప్రశ్నార్థకం చేయడం సమంజసమేనా? ముమ్మాటికీ కాదు. అందుకే%ొ% మాతృ దేశానికి దూరంగా జీవిస్తున్న భారతీయులు కనీసం మాతృత్వపు మాధుర్యాన్నైనా ఆస్వాదించాలి. ఎవరో దయతలచి ఇచ్చే పౌరసత్వం కోసం కన్న పేగును దూరం చేసుకోవద్దు. కడుపు కోతను మిగుల్చుకోవద్దు. అమ్మతనాన్ని అవహేళన చేయవద్దు.

# రోజూ ఈ గింజలు తింటే కొవ్వు ఐస్‌లా కరిగిపోతుంది తెలుసా..?



ఈ మధ్య కాలంలో చాలామంది హై కొలెస్ట్రాల్ సమస్యను ఎదుర్కొంటున్నారు. రక్తంలో కొవ్వు సమస్యతో బాధపడుతున్నారు. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లే ఇందుకు కారణమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అధిక కొలెస్ట్రాల్ కారణంగా గుండె జబ్బుల బారినపడే ప్రమాదం ఉంది. కొలెస్టరాల్ తగ్గడానికి కొన్ని రకాల గింజలు మేలు చేస్తాయి. వాటిలో ఫైబర్‌తోపాటు మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. ఆ గింజలను ఆహారంగా తీసుకోవడంవల్ల కొవ్వు సమస్య నుంచి ఈజీగా బయటపడొచ్చు. మరి ఆ గింజలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.. అవిసె గింజలు గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. వీటినే లీన్ సీడ్స్ అని కూడా అంటారు. ఈ గింజల్లో ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి తోడ్పడుతాయి. కొలెస్ట్రాల్ సమస్యను తగ్గించడంలో చియా విత్తనాలు కూడా దోహదపడతాయి. వీటిలో కూడా ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి దోహదపడతాయి. అదేవిధంగా జనపనార విత్తనాలను తీసుకోవడంవల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ప్రోటీన్‌తోపాటు గామా లినోలెనిక్ యాసిడ్ ఉంటుంది. కొలెస్టరాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి చక్కగా పనిచేస్తాయి. గుమ్మడి గింజలు కూడా కొవ్వును తగ్గించడంలో బాగా పనిచేస్తాయి. ఈ గింజల్లో ఒమెగా-6 ఫ్యాటీ యాసిడ్స్, మోనో శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. నువ్వులకు కూడా కొవ్వును తగ్గించే గుణం ఉంది. వీటిలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. కడుపులో మంటను తగ్గించడంలో, కొవ్వును కరిగించడంలో ఇవి సాయపడతాయి. రక్తంలో కొవ్వు సమస్యతో బాధపడేవారు పొద్దుతిరుగుడు గింజలను తీసుకోవడంవల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో విటమిన్ ‘ఇ’ తోపాటు మోనో శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి సాయపడుతాయి. నల్ల నువ్వులను తీసుకోవడం వల్ల కూడా చెడు కొవ్వు తగ్గుతుంది. వీటితో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు క్యాన్సర్ ముప్పు కూడా తగ్గుతుంది.

## జామ ఆకులు మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు ఈ విషయాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు



జామ పండ్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్న విషయం అందరికీ తెలిసిందే. జామకాయలను కూడా చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఇవి మనకు ఏడాది పొడవునా దాదాపుగా అన్ని సీజన్లలోనూ లభిస్తాయి. జామ పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. జామ పండ్లలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. రోగాలు రాకుండా చూస్తుంది. చర్మాన్ని సంరక్షిస్తుంది. ఈ పండ్లలో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్దకం ఉండవు. ఇలా జామ పండ్లతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. అయితే కేవలం పండ్లే కాదు.. ఆకులు కూడా మనకు కలిగే అనేక వ్యాధులను తగ్గించడంలో ఎంతగానో పనిచేస్తాయి.

**నోటి సమస్యలకు..**

జామ ఆకుల్లో అనేక ఔషధ గుణాలు దాగి ఉన్నాయి. ఇవి మనకు కలిగే వ్యాధులను నయం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. జామ ఆకుల్లో అధిక మొత్తంలో ట్యానిన్స్, ఆక్సలేట్స్ ఉంటాయి. అందువల్ల నోటిపూత, నోటిలో పుండ్లు, చిగుళ్ల వాపు, గొంతు నొప్పి వంటి నోటి సమస్యలతో బాధపడేవారు లేత జామ ఆకులను నమిలితే ప్రయోజనం ఉంటుంది. లేదా జామ ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను నోట్లో పోసుకుని పుక్కిలించాలి. దీంతో సమస్యలు తగ్గుతాయి. అలాగే జామ ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగుతుంటే శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. ముఖ్యంగా దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది.

**వెన్ను నొప్పికి..**

ప్రస్తుత తరుణంలో చాలా మంది వెన్ను నొప్పి సమస్యతో బాధపడుతున్నారు. నిత్యం కంప్యూటర్ల ఎదుట కూర్చుని పనిచేసే ఉద్యోగాలు చేస్తున్నారు. దీంతో వెన్ను నొప్పి వస్తోంది. అయితే ఈ సమస్య ఉన్నవారు జామ ఆకుల నీళ్లను రోజూ తాగుతుండాలి. ఈ ఆకుల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే జామ ఆకుల నీళ్లను రోజూ సేవిస్తుంటే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. జామ ఆకుల్లో క్యాన్సర్ కణాలను నాశనం చేసే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాలు రక్షించబడతాయి. క్యాన్సర్లు రాకుండా ఉంటాయి.

**నిద్రలేమి సమస్యకు..**

రాత్రి పూట జామ ఆకులతో తయారు చేసిన నీళ్లను భోజనం చేసిన అనంతరం తాగితే మైండ్ రిలాక్స్ అవుతుంది. ఒత్తిడి, ఆందోళన నుంచి బయట పడవచ్చు. దీంతో మనస్సు ప్రశాంతంగా మారి చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. జామ ఆకుల నీళ్లను రోజూ తాగితే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. పొట్టలో గ్యాస్ ఉత్పత్తి కాదు. మలబద్దకం నుంచి ఉపశమనం పొందవచ్చు. జామ ఆకుల నీళ్లను తాగితే శరీరంలోని అన్ని అవయవాలకు రక్త సరఫరా మెరుగు పడుతుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో బీపీ నియంత్రణలోకి వస్తుంది. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా చూసుకోవచ్చు. ఇలా జామ ఆకులతో అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# అందాలతో మతిపోగొడుతున్న సందీప ధార్..



మరో ఉదయం మూవీ



## 'వార్ 2' ట్రైలర్ రిలీజ్ డేట్ ఫిక్స్.. మేకర్స్ కీలక అప్‌డేట్

'వార్ 2' సినిమా ట్రైలర్‌ను ఈ నెల 25న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటన .బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ నటుడు జూ.ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'వార్ 2'. యశ్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్యచోప్రా నిర్మిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఆగస్టు 14న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.ఇక, ఈ సినిమా విడుదల తేదీ దగ్గరపడటంతో మూవీ ప్రచార కార్యక్రమాలను మేకర్స్ షురూ చేశారు. ఇందులో భాగంగా మేకర్స్ తాజాగా ట్రైలర్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 25న విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు.కాగా, దాదాపు 2 నిమిషాల 39 సెకన్ల నిడివి గల ఈ ట్రైలర్‌కు సీబీఎఫ్‌సీసర్టిఫికేట్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ మూవీ ట్రైలర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచడం ఖాయమని చిత్ర బృందం భావిస్తోంది.హృతిక్ రోషన్ కబీర్‌గా తిరిగి రాగా, తారక్ ప్రతినాయకుడి పాత్రలో బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. కియారా అద్వానీ కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇది యశ్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్‌లో ఆరో చిత్రం.

## సొంత తమ్ముడిలా చూసుకున్న తమన్

సిత్తరాల సిరపడు, దిమాక్ ఖరాబ్.. వంటి పాటలతో సెన్సేషన్ అయ్యారు సింగర్ సాకేత్. ఎప్పుడూ సరదాగా ఉంటూ, హుషారుగా పాటలు పాడే సాకేత్‌కు గతంలో పెద్ద యాక్సిడెంట్ జరిగింది. చావు అంచుల వరకు వెళ్లి వచ్చానంటూ ఆనాటి విషయాలు గుర్తు చేసుకున్నారు. సింగర్ సాకేత్ మాట్లాడుతూ.. శ్రీరామనవమిరోజు భద్రాచలంలో ఓ షోకి వెళ్లినప్పుడు పట్టపగలే రోడ్డు యాక్సిడెంట్ జరిగింది. ఓ ఆయిల్ ట్యాంకర్ ఇండికేటర్ వేయకుండా సడన్‌గా టర్న్ తీసుకుంది. దాన్ని తప్పించుకోవడానికి మా కారుని కుడివైపు తిప్పాం. సొమ్మయ్య అనుకునేలోపు ఎదురుగా మరో కారు వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో చెల్లి కాలు ఫ్రాక్చర్ అయింది, నా ముక్కుకు బలమైన గాయం తగిలింది. అక్కడ దగ్గర్లో ఆస్పత్రికి వెళ్తే నా కండీషన్ చూసి హైదరాబాద్ తీసుకెళ్లమన్నారు. పక్షవాతం కూడా రావొచ్చేమోనని చెప్పారు. సింగర్ శ్రీకృష్ణ అన్నకు ఫోన్ చేసి.. మా ఇద్దరికీ యాక్సిడెంట్ అయింది, రాలేము. వేరే సింగర్స్‌ను షోకి పంపించమన్నాను. ఆయన అప్పుడు పక్కనే ఉన్న తమన్‌కు విషయం చెప్పారు. వెంటనే అతడు తన కంపోజింగ్ మధ్యలో ఆపేసి ఆస్పత్రికి వచ్చారు. హాస్పిటల్‌లో తనే దగ్గరుండి అన్నీ చూసుకున్నారు. ఎటువంటి సమస్యా లేదన్న తర్వాత రాత్రి 10.30 గంటలకు వెళ్లిపోయారు. డిశ్చార్జ్ అయ్యాక కూడా వారంరోజులపాటు బెడ్‌పైనే ఉన్నాను. లేచి నిలబడలేకపోయాను. అప్పుడు నాకు పెద్ద హోటల్ నుంచి కొన్నిరోజులపాటు టిఫిన్ తెప్పించారు. మనసు బాగోలేదని చెప్తే ఐదు నిమిషాల్లో గోవా టికెట్స్ బుక్ చేశారు. ఫ్లైట్‌లోనే గోవా వెళ్లాను. బీచ్ చూసుకుంటూ కొంత ప్రశాంతంగా గడిపాను. అందుకే తమన్ అంటే నాకు అభిమానం, ఇష్టం అని పేర్కొన్నారు. ఇక బిగ్‌బాస్ తొమ్మిదో సీజన్‌లో ఎంట్రీ ఇస్తున్నారా? అన్న ప్రశ్నకు ఇలా స్పందించారు. వెళ్లను అని చెప్పను, వెళ్తున్నా అని కూడా చెప్పను. ప్రస్తుతానికైతే బిగ్‌బాస్ 9వ సీజన్‌కు వెళ్లడం లేదు. కానీ, ఎప్పుడో ఒకసారి తప్పకుండా వెళ్తా.. కెరీర్‌లో ఇంకో అడుగు ముందుకు వేశాక బిగ్‌బాస్ గురించి ఆలోచిస్తాను అని సింగర్ సాకేత్ చెప్పుకొచ్చారు.



## అందుకే నా పాత్రలు అంతగా నచ్చేశాయి



గత కొన్నేళ్లలో తీసుకుంటే సినిమాలు చాలావరకు తగ్గించేసిన సమంత.. ఓటీటీలపై పూర్తిగా దృష్టి పెట్టింది. పలు వెబ్ సిరీసుల్లో నటించింది. ఈ క్రమంలోనే తాజాగా అమెజాన్ ప్రైమ్ బ్రాండ్ క్యాంపెయిన్‌లో పాల్గొంది. తన ప్రయాణం అంతా రకరకాల భావోద్వేగాలతో నిండిందని చెప్పుకొచ్చింది. సమంత మాట్లాడుతూ.. ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్ హనీ బన్నీ తదితర సిరీసుల్లో తను పోషించిన పాత్రలని గుర్తు చేసుకుంది. ప్రతి పాత్ర ప్రేక్షకులు అనుభూతి చెందేలా, ఆ పాత్ర తాలూకు భావోద్వేగాలతో మమేకమయ్యేలా ఉంటాయని అందుకే అవి అంతగా వారికి చేరువ అయ్యాయని చెప్పింది. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న సినీ సహనటుడు మనోజ్ బాజ్ పేయి కూడా ఆసక్తికర వ్యాఖ్యలుచేశారు. ఫ్యామిలీ మ్యాన్‌లో తను పోషించిన పాత్రలోని భిన్న కోణాలు తనపై ఎంత ప్రభావం చూపించాయో మనోజ్ బాజ్ పాయ్ గుర్తుచేసుకున్నారు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com